


# విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 04-08-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 40 సంచిక : 323 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## నిరుపేదలకు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు పర్చండి

- బ్యాంకర్లు, ఎంపిడిఓలు ప్రత్యేకాధికారులు సమన్వయంతో పనిచేయండి
- ఎపిఎస్‌సిసి ఎఫ్‌సి మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ జి. శ్రీకర్



విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అంద జేస్తున్నదని వాటిని సక్రమంగా అమలు పర్చాల్సిం దిగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సహకార ఆర్థిక సంస్థ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ విజయకుమార్ జి. శ్రీకర్

తరువాయి 2లో

- తండ్రిలా అండగా నిలిచారు..
- స్ఫూర్తినిచ్చినందుకు కృతజ్ఞతలు
- మోడీ 'టచింగ్' లెటర్



## మీకున్న అపార జ్ఞానం, మేధో నైపుణ్యం దేశానికే ఆదర్శం

న్యూఢిల్లీ: రాష్ట్రపతిగా తన చివరి రోజున ప్రధాని మోడీ నుంచి ఒక లేఖ అందుకున్నా నని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పేర్కొన్నారు. మోడీ రాసిన లేఖను ట్విట్టర్‌లో ఆయన షేర్ చేశారు. మూడేళ్ల కాలంలో ప్రణబ్ తనపై ఎంతో ప్రేమను, వాత్సల్యాన్ని చూపించారని మోడీ తన లేఖలో చెప్పారు. 'ప్రణబ్ దా.. మన రాజకీయ ప్రస్థానాలు విభిన్నమైన రాజకీయ నేపథ్యాల్లో రూపుదిద్దు కున్నాయి.

అయినా మీ మేధోబలం, విజ్ఞత వల్ల మనం సమిష్టితత్వంతో కలిసి పనిచేయగలిగాం' అని అన్నారు. మూడేళ్ల క్రితం ఒక బయటి వ్యక్తిగా తాను ఢిల్లీ వచ్చానని, ఆ సమయంలో తన ముందున్న కర్తవ్యంతో సవాళ్లతో కూడుకున్నదని, కానీ మీరిచ్చిన ప్రోత్సలం నాకు అండగా నిలిచిందని ప్రణబ్‌ను ఉద్దేశించి మోడీ చెప్పు కొచ్చారు.

ఒక తండ్రిలాగా, గురువు లాగా నాకు అండగా నిలిచారని అన్నారు. 'మీ మేదస్సు, వ్యక్తిగత అనుబంధం నాకెంతో ఆత్మవిశ్వాసాన్ని, బలాన్ని ఇచ్చాయి. మీకున్న అపార జ్ఞానం, మేధో నైపుణ్యం ప్రభుత్వానికి ఎంతగానో తోడ్పడ్డాయి' అని లేఖలో వివరించారు. మద్దతుగా నిలిచినందుకు, స్ఫూర్తి నిచ్చినందుకు ప్రణబ్‌కు మోడీ కృతజ్ఞతలు తెలిపారు.

## కిరోసిన్‌పై కూడా సబ్సిడీ కట్?



ముంబై: ఎల్‌పీజీ సిలిండర్లపై సబ్సిడీలో కోత పెట్టిన కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. కిరోసిన్‌పై సబ్సిడీ కొనసాగించేందుకు సానుకూలంగా లేని ప్రభుత్వం క్రమంగా దీన్ని ఎత్తివేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఎకనామిక్

తరువాయి 2లో

## స్టీల్ ప్లాంట్‌లో అభివృద్ధి పరచిన స్పోర్ట్స్ పోర్టల్ ప్రారంభం



గాజువాక: క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం పొందవచ్చునని ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) కిషోర్ చంద్ర దాస్ పేర్కొన్నారు. గురువారం ఉక్కు క్రీడా విభాగం ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ లో న్యూస్పోర్ట్స్ పోర్టల్‌ను ఉక్కు డైరెక్టర్(పర్సనల్) కిషోర్ చంద్ర దాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు క్రీడా విభాగం వివిధ రకాలైన క్రీడలను నిర్వహిస్తున్నదని, మరిన్ని క్రీడలను నిర్వహించాల్సిన

తరువాయి 2లో

## విక్రమ్‌గౌడ్ అరెస్టు

### డైరెక్షన్ అదుర్స్.. సినిమా అట్టర్ ఫ్లాప్



హైదరాబాద్: మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నియోజకవర్గ ప్రజల సానుభూతి కోసం ఆయన కాల్పుల డ్రామా ఆడి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందారు. కోలుకున్న విక్రమ్‌ను ఈ రోజు డిశ్చార్జి చేసిన వెంటనే బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విక్రమ్‌ను అపోలో ఆస్పత్రి నుంచి నేరుగా నాంపల్లి కోర్టుకు తరలించారు. పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు, అక్రమ ఆయుధాన్ని కల్గి దాన్ని ఉపయోగించిన ఘటనలో ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. ఈ ఘటనకు ప్రధాన సూత్రధారి, పాత్రధారిగా ఉన్న విక్రమ్‌గౌడ్‌తో సహా

తరువాయి 7లో




## నోటాతోనే గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు


### స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: గుజరాత్ రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో పై వారెవరూ కాదు (నోటా) ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నోటా విధానంపై కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నోటా ఆప్షన్‌పై స్టే విధించాలని పిటిషన్ వేసింది. దీనిపై విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం బుధవారం అంగీకరించింది. గురువారం విచారణ చేపట్టిన కోర్టు.. కాంగ్రెస్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. నోటాతోనే గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించింది. ఈ నెల 8న గుజరాత్‌లో 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యసభ ఎన్నికల్లోనే తొలిసారిగా నోటా విధానాన్ని ప్రవేశపెట్టింది ఎన్నికల కమిషన్. రాజ్యసభ ఎన్నికల్లో సీక్రెట్ బ్యాలెట్‌ను ఉపయోగించరు. ఓటేసిన ఎమ్మెల్యేలు తమ పత్రాన్ని తమ పార్టీ పోలింగ్ ఏజెంట్‌కు చూపించిన

తరువాయి 2లో




### టేకిట్ ఈజీ



నిన్న గ్యాస్ మీద సబ్సిడీ కట్..
నేడు కిరోసిన్‌పై కటింగ్..
రేపటి నుంచి దేనిమీద
కటింగ్ పెడతారో
మరి నాకు
తెలియడంలేదు సార్!!

## గిరిజన వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు

- గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సదుపాయాల మెరుగుపై దృష్టి
- గిరిజన సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 3,100 కోట్లు కేటాయింపు
- రాష్ట్ర శాసనసభా గిరిజన సంక్షేమ కమిటీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు



విశాఖపట్నం: గిరిజన వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని రాష్ట్ర శాసనసభా గిరిజన సంక్షేమ కమిటీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం గురువారం విశాఖకు వచ్చిన పది మంది సభ్యులతో కూడిన రాష్ట్ర శాసన సభా గిరిజన సంక్షేమ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు ప్రభుత్వ అతిధి గృహంలో గిరిజన సంఘాల నాయకుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు పాత్రికేయులతో మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 3,100 కోట్లును గిరిజనుల సంక్షేమానికై ప్రభుత్వం కేటాయించిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్య సదుపాయాలతో పాటు మౌలిక వసతుల మెరుగుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గిరిజనుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పలు

తరువాయి 2లో

# "21 రోజుల యోగబట్టి" మహోత్సవం



గాజువాక: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం పాత గాజువాక శాఖ బ్రహ్మకుమారి మమత ఆద్వర్యంలో "21రోజుల యోగబట్టి" కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక వర్తక సంఘం అధ్యక్షులు తిప్పల చిన అప్పారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సంస్థ తొలి సంచాలకురాలు బ్రహ్మకుమారి ప్రకాశమణి దాది చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థకు విశేష సేవలందించారని అన్నారు. వేలాది బ్రహ్మకుమారీలను ప్రేమానురాగాలతో శాంతి కాముకులుగా తీర్చిదిద్దిన "ప్రకాశమణి దాది" అవ్యక్త దినాన్ని పురష్కరించుకొని 21రోజుల యోగబట్టి నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యోగాతో మనిషిలోని అనేక రుగ్మతలను తొలగించుకొని, ఆరోగ్యవంతమైన జీవనం కొనసాగించవచ్చునని అన్నారు.

ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి విజయలక్ష్మి, బి.కె. రామారావు, బి.కె. శ్రీను, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## విశాలాక్షి సేవలు మరువలేనివి

### -డా.సుగుణారెడ్డి

**ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు సన్మానం**




కాకినాడ : సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్న డా. విశాలాక్షి ని ఆసంస్థడైరెక్టర్ గా.ఎన్.సుగుణా రెడ్డిఘనంగా సన్మానించారు.మూడు దశాభ్ధాల పైబడి అత్యుత్తమ క్రమశిక్షణ తో పాటుఉత్తమ విద్యా సేద్యం చేస్తూ ఆదిత్య విద్యా సంస్థలలో అధ్యాపకురాలుగా,అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా,అసోషియేట్ ప్రొఫెసర్‌గా,విభాగాధిపతిగా,పరీక్షల పర్యావేక్షణ విభాగాధిపతిగా మరియు ప్రిన్సిపాల్‌గా వివిధ విభాగాలలో సమర్ధవంతంగా 15సంవత్సరాలుగాసేవలందిస్తున్న డా.ఎన్.విశాలాక్షి ఆదిత్య కుటుంబ సభ్యురాలుగావిశిష్ట సేవలందించిన ఆమె అందరికీ ఆదర్శమని డా.సుగుణారెడ్డి కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహిత విశాలాక్షి మాట్లాడుతూ 15 సంవత్సరాల తన ప్రయాణంలో ఆదిత్య యాజమాన్యం సహాయ సహకారాలు మరువలేనివన్నారు.ఆదిత్య లో చేరిన తర్వాత జీవితంలోఎన్నో నేర్చుకున్నానన్నారు.సహచర ఉపాధ్యాయ,ఇతర సిబ్బంది సహకారంతో తన కాలంలో తన భాద్యతలను దిగ్విజయంగా నిర్వహించానాన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్ధినీ విద్యార్థులు ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ లబ్దిదారులు ఎంపిక



రావులపాలెం : రావులపాలెం మండల పరిధి గోపాలపురం, ఈతకోట, పొడగట్లపల్లి, ముమ్మిడివరప్పాడు గ్రామాల్లో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సచివాలయాల వద్ద గృహ నిర్మాణ లబ్దిదారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకంలో మంజూరైన లబ్దిదారులు ప్రతి ఒక్కరూ గృహాలు నిర్మించుకోవాలని అన్నారు. గోపాలపురంలో 71 మందికి, పొడగట్లపల్లిలో 73 మందికి, ఈతకోటలో 75 మందికి, ముమ్మిడివరప్పాడు 1 గృహాలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన లబ్దిదారులను విఆర్‌ఓలు, గ్రామ కార్యదర్శి, క్షేత్ర సహాయకులు సమీక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సిహెచ్ ఉదయ భాస్కర్, ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారి పి.వి. రమణ, సర్పంచ్‌లు ఆనే లక్ష్మీ ముసలయ్య, సుమతీ ఆనంద్, కుడుపూడి వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు ప్రాదేశిక సభ్యులు, నీటి సంఘ అధ్యక్షులు మైగాపుల గురవయ్యనాయుడు, ఆనే ముసలయ్య, అయితాబత్తుల అనందరావు, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వానపల్లి త్రిమూర్తులు, గోపిశెట్టి సత్తిపండు, వెలుగొట్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాలకు గిరాకీ



రాయగడ : వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తుండటంతో రాయగడ బజారులోకి భారీ ఎత్తున వినాయక బొమ్మలు అమ్మకానికి సిద్ధం చేశారు. వినాయక విగ్రహాల తయారీకి పేరొందిన అమలాపేట కళాకారులతో పాటు కోల్‌కత్తా నుంచి వచ్చిన కళాకారులు ఇక్కడ భారీ ఎత్తు విగ్రహాలను రూపొందిస్తున్నారు. ఆంధ్రా కొత్తవలస నుంచి భారీ ఎత్తు విగ్రహాలను తెప్పించి గజపతి కూడలిలో అమ్మకాలకు ఉంచారు. ఇదిలా ఉండగా న్యూకాలనీ స్వాగత్ రోడ్డులో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులే సొంతంగా భారీ ఎత్తు విగ్రహాలను రూపొందిస్తున్నారు. ఉత్సవ కమిటీల వారు నచ్చిన విగ్రహాలకు బయానా(అడ్వాన్స్) ఇచ్చి విగ్రహాలను ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. దీంతో వినాయక విగ్రహాలకు గిరాకీ ఏర్పడింది.



విశాఖపట్నం: విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి అర్బన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి బుద్దా నాగ జగదీష్, అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో సెప్టెంబరు నెల నుండి రెండు నెలలు 60 రోజుల పాటు జరగబోవు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం గూర్చి మాట్లాడారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అచ్యుతాపురం: ట్రాఫిక్ నిబందనలు పాటించక పోవడం వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని యలమంచిలి సిఐ కె.విజయ్‌నాథ్ అన్నారు. గురువారం స్థానిక కైట్స్ కళాశాలలో ట్రాఫిక్ నిబందనలు, విద్యార్థి దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పని సరిగా హెల్‌మెట్ దరించాలన్నారు. 18 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన యువతీ, యువకులు వాహనాలు నడిపితే వారితోపాటు వారి తల్లిదండ్రులపైనా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. విద్యార్థులు చెడు మార్గాలలో వెళ్ళకుండా మంచి మార్గంలో వెళ్ళాలన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేసించుకొని ఆ లక్ష్యం చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ డి.దీనబందు, రాంబిల్లి ఎస్‌ఐ కుమారస్వామి, అడిషనల్ ఎస్‌ఐ మళ్ళేశ్వర్రావు, కళాశాల చైర్మెన్ రెడ్డి చిరంజీవి, కళాశాల ప్రిన్సిపల్ విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠం

పగిడ్యాల: పుట్టిన శిశువుకు ముర్రుపాలే శ్రేష్ఠమని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు వరలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని బీరవోలు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు ముర్రు పాలు అందించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగు తుందన్నారు. ముర్రుపాల వల్ల కలిగే ప్రయోజ నాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాములవార్కి వెండి కవచం బహూకరణ



రావులపాలెం : రావులపాలెం ముసలి రామాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి, షిర్డి సాయి బాబా వార్ల ఆలయంలో ఏకాదశి శ్రావణ మాసం సందర్భముగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా సత్తి రామ చంద్రారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ఒక కేజి వెండి కవచాన్ని బహూకరించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ కవచానికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వార్కి అలంకరించారు. అలాగే మేడపాటి సూర్యనారాయణరెడ్డి దంపతులు సీతారామచంద్రస్వామి వార్లకు ఆలయంలో అభిషేకం నిమిత్తం 1కేజి వెండితో వెండి బిందె, అరకేజి వెండితో వెండి పళ్ళెం అందజేసారు. అదే విధంగా షిర్డిసాయి ఆలయంలో బొక్కా ప్రసాద్, దీప్తి దంపతులు వెండి హారాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు పోతంశెట్టి కనికిరెడ్డికి అందజేసారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బాబాకు అలంకరించారు. ఈ హారాన్ని తన అత్త మామలు, తమ కుమారుడు ధన సహాయంతో ఈ హారాన్ని తయారు చేయించి బహూకరించామని బొక్కా ప్రసాద్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## కిరోసిన్‌పై కూడా సబ్సిడీ కట్?

టైమ్స్ నివేదిక ప్రకారం గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ కోత మాదిరిగానే కిరోసిన్ పై సబ్సిడీని కూడా తగ్గించాలని యోచిస్తోంది. ఇంధనాల మార్కెట్ ధరలను సమాజంలోని పేద వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండే లక్ష్యంతో చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనిచేస్తున్నారని అధికారులు చెప్పినట్టు తెలిపింది.

సబ్సిడీ కిరోసిన్ ధరలను ప్రతి పదిహేను రోజులకు 25 పైసలు పెంచాలని చమురు కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది. పూర్తిగా సబ్సిడీని తొలగించేంత వరకు, లేదా తదుపరి ఆదేశాల వరకు దీన్ని అమలు చేయాలని కోరింది. సబ్సిడీల్లో కోత పెట్టి వినియోగ వస్తువుల ధరలను మార్కెట్ ధరల స్థాయికి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ఎల్‌పీజీ కు మారడానికి వినియోగదారులను ప్రోత్సహించడంతోపాటు, కాలుష్యం నివారణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. అయితే దీనిపై అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు దీనిపై భారీ సబ్సిడీ అమలు చేస్తున్న డిమాండ్ గణనీయంగా తగ్గింది. 2016-17లో 66 శాతం క్షీణించిన కిరోసిన్ వినియోగం 78,447 లీటర్లకు పడిపోయింది.

కాగా మార్చి 2018 నాటికి వంటగ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసే వ్యూహంలో సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్ ధర రూ .4 చొప్పున పెంచాలని జూలై 31 న ప్రభుత్వం ఆదేశించిన చమురు కంపెనీలకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం, ఢిల్లీ, చండీగఢ్ కిరోసిన్ ఫ్రీ నగరాలుగా ఉన్నాయి.

## నోటాతోనే గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు

తర్వాతే బ్యాలెట్ బాక్సులో వెయ్యాల్సి ఉంటుంది. అయితే ఈ విధానాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. మరోవె%పు గుజరాత్‌లో 3 స్థానాలకు జరిగే ఎన్నికలను భాజపా, కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. భాజపా నుంచి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్రమంత్రి స్మృతీ ఇరాని పోటీ పడుతుండగా.. కాంగ్రెస్ నుంచి పార్టీ సీనియర్ నేత, సోనియా సలహాదారు అహ్మద్ పటేల్ బరిలోకి దిగారు.

## గిరిజన వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నదన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో పని చేసే అధికారులు, సిబ్బంది వాటి అమలుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడం వల్ల సత్ ఫలితాలను ఇవ్వలేక పోతున్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో పలు పథకాలు, కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు, గిరిజనుల నుండి వినతులను స్వీకరించేందుకు రెండు రోజుల పాటు విశాఖ జిల్లాలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. గిరిజనులకు సంబంధించి జిల్లాలో రూల్ ఆఫ్ రిజర్వేష్ అమలుపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలక్టరేట్‌లో సమీక్షించనున్నామన్నారు. అనంతరం అరకు బయలుదేరి వెళతామని, మార్గం మధ్యలో గిరిజన సంక్షేమ వసతి గృహాలను సందర్శిస్తామని ఆయన తెలిపారు. శుక్రవారం పాడేరులో వినతులను స్వీకరిస్తామని, ఐటిడిఎ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని, సాయంత్రం తిరుగు ప్రయాణంలో గిరిజన సంక్షేమ వసతి గృహాలను సందర్శిస్తామని ఆయన తెలిపారు.

సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శి కె. లోకనాథం, విశాఖ జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆర్ఎస్. దొర, గిరిజన ఐక్య వేదిక అధ్యక్షుడు ఎల్. చిట్టిబాబు, రావికమతం మండలం కొట్నాబిల్లి పంచాయితీ సాధన కమిటీ అధ్యక్షుడు ఎన్. నాగేశ్వరరావు, తదితరులతో పాటు పలు గిరిజన సంఘాల ప్రతినిధులు రాష్ట్ర శాసనసభా గిరిజన సంక్షేమ కమిటీకి వినతులు సమర్పించారు.

రాష్ట్ర శాసనసభా గిరిజన సంక్షేమ కమిటీ సభ్యులు గిడ్డి ఈశ్వరి, వి. రాజేశ్వరి, కె. అప్పలనాయుడు, జి. వీరాంజనేయులు, వి. బాలసుబ్రహ్మణ్యం, టి. రత్నాబాయి తదితరులతో పాటు అరకు శాసనసభ్యులు కిడారి సర్వేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్‌లో అభివృద్ధి పరచిన స్పోర్ట్స్ పోర్టల్ ప్రారంభం

అవసరం ఎంతయినా ఉందని అన్నారు. మంచి ఆరోగ్యానికి, మెరుగైన శారీర దారుఢ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు ఇ.డి(కార్పోరేట్ సర్వీసెస్) ఆర్.పి.శ్రీవాత్సవ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(పి.అండ్ఐఆర్)దేబాషిస్‌రాయ్, ఇ.డి. (ఐఏఅండ్ఎస్‌వి)కె.వి.రమణారావు, జనరల్ మేనేజర్ (హెచ్.ఆర్) ఆర్.వి.రావు, జి.యం.(ఐ.టి) కె.వి.ఎస్.ఎస్. రాజేశ్వర్‌రావు, ఐ.టి.హెచ్.ఓ.డి. సుమన్‌దాస్, డి.జి.యం(ఐ.టి)జి.త్యాగరాజు, ఉక్కు క్రీడా విభాగం ఏ.జి.ఎం.ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు పర్చండి

అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలక్టర్ ప్రవీణ్ కుమార్, ఎంపిడిఓలు బ్యాంకర్లు, జిల్లా అధికారులతో సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ నిరుపేదలకు ఉపాధి కల్పన కొరకు ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారని, సబ్సిడీపై వివిధ రకాల యూనిట్లను మంజూరు చేయడం జరుగుచున్నదని, వాటిని నెలొల్పేందుకు లబ్దిదారులకు అధికారులు అనుమతులివ్వాలన్నారు. ముఖ్యంగా బ్యాంకర్లు వివిధ కారణాలతో రుణ సౌకర్యాన్ని అందించడం లేదని తమ దృష్టికి వస్తున్నదన్నారు. ప్రతీ ఒక్కరూ మానవతా దృక్పథంతో చిత్తశుద్దితో పనిచేయాలన్నారు. నిరుపేదలకు కేటాయించిన సంక్షేమ పథకాలను కాబట్టి గైడ్ లైన్స్ అనుసరించి బ్యాంకర్లు రుణాలను అందజేసి పేద వారికి సహాయ సహకారాలనందించాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రుణాలనందజేసి రైతులుకు అండగా ఉండాలన్నారు. ప్రతి వ్యక్తి తాను చేస్తున్న పని పట్ల అంకిత భావాన్ని కలిగి ఉండాలన్నారు. యువకులకు ప్రత్యేక శిక్షణనిప్పించి వాలంటీర్లుగా నియమించడం ముదావహనమైన సంఘటనగా అభివర్ణించారు. ఈ సమావేశంలో జిల్లా కలక్టర్‌తో పాటు డిఆర్‌డిఎ, డ్వామా, యూసీడీ ప్రాజెక్టు అధికారులు సత్యసాయి శ్రీనివాస్, కల్యాణ్ చక్రవర్తి, శ్రీనివాసన్, ఎస్‌సి, బిసీ కార్పొరేషన్ ఇడిలు మహాలక్ష్మి, మురళీబాబు, జిల్లా పరిషత్ సిఇఓ జయప్రకాష్ నారాయణ్, ఎల్‌డిఎం. శరత్ బాబు, బ్యాంకర్లు ఎంపిడిఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అన్నా వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు



చెన్నై: నగరంలోని అన్నావిశ్వ విద్యాలయం లోని వివేకానంద ఆడిటోరియంలో క్యాలి బర్-2017 అంతర్జాతీయ సదస్సు ప్రారంభం అయింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి కేపీ అన్బళగన్ సదస్సును ప్రారంభించారు. మూడురోజుల పాటు కార్యక్రమం జరగనుంది. కన్వెన్షన్ ఆన్ ఆటోమేషన్ ఆఫ్ లైబ్రరీస్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్స్ (సీఏఎల్ఐబీఈఆర్) పేరిట సదస్సును దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల సహకారంతో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈసారి గుజరాత్‌లోని ఇన్‌ఫ్లెబ్‌నెట్ సెంటర్, అన్నా వర్సిటీ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. విద్యలో గ్రంథాలయాల పాత్ర, రోబోల వినియోగం తదితర అంశాలపై సదస్సు జరగనుంది. ఐటీ, ఇన్‌స్టిట్యూట్ ఇతర విభాగాల నిపుణులు తదితరులు పెద్దసంఖ్యలో సదస్సుకు హాజరయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ పాలీవాల్, ఇన్‌ఫ్లెబ్‌నెట్ సెంటర్ డైరెక్టర్ జగదీష్ అరోర, ప్రభుత్వ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి పవన్‌కుమార్ అగర్వాల్, అన్నా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.గణేశన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావనీర్ ఆవిష్కరించారు.

## కన్నడపై పరిశోధనకు వర్సిటీ మంచి వేదిక

హొసపేటె : కన్నడ భాష, సంస్కృతి, సంప్రదాయాల పట్ల పరిశోధన చేయడానికి హంపీ కన్నడ విశ్వవిద్యాలయం మంచి వేదికగా పని చేస్తుందని వృత్తి విరమణ పొందిన వర్సిటీ దృశ్యకళా విభాగం అధిపతి డాక్టర్ ఎస్.సి.పాటిల్ పేర్కొన్నారు. వర్సిటీలో ఆది నుంచి విధులు నిర్వహిస్తూ జులై 31న వృత్తి విరమణ పొందిన ఆయనకు, వర్సిటీ ఉద్యానవనాల నిర్వహణ విభాగం అధికారి బి.జయదేవప్పకు ఇక్కడ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యార్థులకు నేర్పటం కన్నా, మేము నేర్చుకున్నదే చాలా ఎక్కువ. ఇక్కడి పరిసరాల్లో అలాంటి శక్తి ఉందని పాటిల్ అన్నారు. విద్యా ర్థులు మొక్కబడి పరిశోధనలు చేయ కుండా, మంచి మార్గదర్శకులను ఎంచుకుని, కొత్త విషయాలను వెలుగులోకి తీసుకురావాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఉప కులపతి డాక్టర్ మల్లికాఘంటి, కులసచివుడు డాక్టర్ పాండురంగబాబు, డాక్టర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ పరిశోధనలకు

# గీతం పిహెచ్‌డి అవార్డు

సాగర్‌నగర్: మేనేజ్‌మెంట్ రంగంలో ముఖ్యంగా మానవ వనరులు, బ్యాంకింగ్ రంగం పై జరిపిన పరిశోధనలకు గాను ఇద్దరు పరిశోధక విద్యార్థులకు గీతం విశ్వవిద్యాలయం పిహెచ్‌డి అవార్డులను ప్రకటించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోత రాజు వివరాలు తెలియజేశారు.

**కోరమండల్ సంస్థలో మానవ వనరుల ప్రణాళిక అత్యుత్తమం డాక్టర్ జి.వి.ఆర్.కె.రాజు**



సంస్థ ప్రగతికి మానవ వనరుల నిర్వహణ ప్రణాళిక అవసరమని దీనిపై కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థను పరిశోధనకు ఎంచుకుని అక్కడ అమలు జరుగుతున్న ప్రణాళికలను తులనాత్మక అధ్యయనం చేశామని డాక్టర్ రాజు తెలిపారు. సంస్థ లక్ష్యాలను చేరడంలో హెచ్‌ఆర్ ప్రణాళికలు ఏ మేరకు ఉపకరించాయనే దానిపై తమ పరిశోధనా పత్రాన్ని సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. హెచ్‌ఆర్ ప్రణాళికలో కోర మండల్ నమూనాగా నిలుస్తుందని తెలిపారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జి.రాఘవయ్య నేతృత్వంలో జరిపిన ఈ పరి శోధనా ఫలితాల ఆధారంగా త్వరలో హెచ్‌ఆర్ ప్రణాళికపై గ్రంథాన్ని వెలువరించనున్నట్లు డాక్టర్ రాజు తెలిపారు.

**బ్యాంకింగ్ రంగంలో ఆస్తి బాధ్యతల నిర్వహణ కీలకం డాక్టర్ తేజస్విని**



బ్యాంకింగ్ రంగంలో ఆస్తులు మరియు రుణాల మధ్య అసమతుల్యత కారణంగా ఉత్పన్న మయ్యే వివిధ నష్టాలను ఎదుర్కో వడా నికి అస్సెట్ లయబులిటి మేనేజ్‌మెంట్ అనేది అవసరమని ఈ అంశం పై గీతం ఇని స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా నేతృత్వంలో పరిశోధన జరిపిన డాక్టర్ తేజస్విని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు ఎదుర్కొంటున్న వివిధ ఆర్థిక సమస్యలను తులనాత్మక అధ్యయనం చేశామని ఆమె వివరించారు. తమ పరిశోధన ద్వారా బ్యాంకులకు సంక్షోభాలను ఏ విధంగా ఎదుర్కొ నవచ్చో సాంకేతికంగా పరిష్కార మార్గాలు సూచించామన్నారు.

# మూడు రోడ్ల కూడలిలో శ్రావణ శోభ

సబ్బవరం: మండల కేంద్రంలో శ్రావణశోభ సంతరించుకుంది. శ్రావణ మాసంలో మహిళలు వరలక్ష్మిదేవి పూజ కోసం పండ్లు, పూలూ, చీర, రైక కోసం వెళితే మార్కెట్‌లో అధిక ధరలతో వున్నాయని కొంతమంది నిట్టూరుస్తున్నారు. మరికొంతమంది అధిక ధరలు అయినా కొనక తప్పదు అంటున్నారు. ఒక చామంతి పువ్వు ధర రూ.10లు, గులాబి పువ్వు ధర రూ.20లు, కొబ్బరి కాయ ధర రూ.30లుకాగా పండ్లు కూడా అదే ధరలో అమ్ముతున్నారు. అయినా పూజ కోసం తప్పదు అంటున్నారు మహిళలు. శ్రావణ మాసంలో శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. సకల అరిష్టాలను తొలగించి సకల సౌభాగ్యాలను ఇచ్చే మాతగా వరలక్ష్మిదేవిని పూజిస్తారు. వరలక్ష్మిదేవిని పూజించినా, నమ్మినా సకల సౌభాగ్యాలు కలుగుతాయని స్త్రీల నమ్మకం. మహిళలు శ్రావణ శుక్రవారం రోజు నోము నోచి వరలక్ష్మి వ్రత కథను పారాయణం చేస్తారు. ఇంకొంత మంది భజనలు, కీర్తనలు చేస్తారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ పక్వాడా

భీమునిపట్నం: స్వచ్ఛ భారత్ నిర్మాణంలో ప్రతీ విద్యార్థి బాధ్యతాయుతమైన భాగ స్వాములు కావాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోర్లి దయాకుమారి అన్నారు. కళాశాలలో స్వచ్ఛ పక్వడా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో 15 రోజుల పాటు జరుగుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు బి.హరిబాబు, కె.హరిప్రసాద్, స్వచ్ఛభారత్ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.కుసుమబచ్చన్, ఎన్‌సిసి ఆఫీసర్ సి.హెచ్.నాయుడు పాల్గొన్నారు.

# చంద్రన్న బీమా చెక్కులు పంపిణీ

భీమునిపట్నం: మండల మహిళా సమాఖ్య భవనంలో జరిగిన కార్యక్రమానికి భీమిలి మండల ఎంపీపీ యరబాల కృష్ణవేణి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయడంలో మహిళా పొదుపు సంఘాల సభ్యులు బాధ్యత వహించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధిత కుటుంబాలను కష్టాలలో ఆదుకోవడానికి ఈ బీమాను అమలు చేశారని, ముఖ్యంగా మహిళలు ఆర్థిక స్వావలంభన పయనించేలా కృషి చేయాలని ఆమె కోరారు. అనంతరం వివిధ సంఘటనలలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు చెందిన ఐదుగురికి రూ.10.90 లక్షలు నష్ట పరిహారం బ్యాంకు చెక్కులను ఎంపీపీ యరబాల కృష్ణవేణి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.అప్పారావు అందించారు. అలాగే ఇరువురు రైతులకు పశుగ్రాస పెంప కానికి ఏడు ఎకరాలకు రూ.1.32 లక్షల లీజు సొమ్ముగా అందించారు. ఇందులో వెలుగు ప్రాజెక్టు డిపిఎం వెంకటరమణ, ఎండిఒకె. హరి ప్రసాద్, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వినాయక చవితి ఉత్సవాలకు

# ఈనెల 16కల్లా పేర్లను నమోదు చేసుకోవాలి



భీమునిపట్నం: మండలం మరియు మున్సిపల్ పరిధిలో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించే వారికి భీమునిపట్నం పోలీసు స్టేషన్‌లో సిఐ బాలసూర్యారావు నియమ నిబంధనలను తెలిపారు. వినాయక విగ్రహాలు 8 అడుగులు వుండాలని, మట్టి విగ్రహాలనే వాడాలన్నారు. హాస్పిటల్స్, పాఠశాలలు, దేవాలయాల వద్ద విగ్రహాలు పెట్టవద్దని, రాత్రి 10 గంటలకే మైక్‌సెట్స్ ఆపాలన్నారు. ఉత్స వాలు నిర్వహించే వారు ముందుగా నోటరీ అఫిడవిట్‌తో పాటు చలానా ఈనెల 16లోగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రామదాసు, పి.శ్రీను వాసరావు, డి.కాంతారావు, ఉత్సవాలు నిర్వహించే వారు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి మినిమమ్ ఛార్జ్ రూ.5లు

భీమునిపట్నం: వాల్తేరు డిపో మేనేజర్ గంగాధర్‌రావు ఆర్‌టిసి సిబ్బంది ఆర్‌టిసి బస్సులలో మినిమమ్ ఛార్జ్ రూ.5లు అని బస్ ప్రయాణికులకు తెలియజేయడం కోసం ప్లకార్డు ప్రదర్శన చేశారు. భీమిలి పాత బస్‌స్టాండ్ వద్ద బస్‌ల లోకి వెళ్లి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఇందులో వాల్తేరు డిపో మేనేజర్ గంగాధర్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

## యువజనోత్సవాలకు ఏర్పాట్లు

నర్సీపట్నం : యువజనోత్సవాలను నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారి చేసిందని ఎంపిడిఒ బిహెచ్‌వి. రమణబాబు తెలిపారు. యువజన సర్వీసులశాఖ ఆదేశాల మేరకు వివిధ సాంస్కృతిక పోటీలను 15 నుంచి 29 ఏళ్ల వయస్సు కలిగిన యువతీ యువకులకు నిర్వహించ డానికి ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమం జరుగుతుందన్నారు. దరఖాస్తులు ఈ నెల 19వ తేదీల్లోగా జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

# సింహాద్రినాధుని దర్శించుకున్న రాష్ట్ర అసెంబ్లీ ఎస్టీ కమిటీ



సింహాచలం : సింహాద్రిపై కొలువుతీరి ఉన్న వరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని రాష్ట్ర అసెంబ్లీ ఎస్టీ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తమ సభ్యులు, యామంచిలి శాసనసభ సభ్యురాలు వంగలపూడి అనిత గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదల ప్రకారం కార్యనిర్వాహణాధికారి కోడూరి అచ్చుత రామ చంద్రమోహన్ పూలమాలలు ఇచ్చి ఘనస్వాగతంపలికారు. అర్చకస్వాములు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. తొలుత వీరు కప్పస్థంభం ఆలింగనం చేఉకున్నారు. వేదనాదల నడుమ బేడాప్రదక్షణ స్వామివారికి తమ తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. తదుపరి స్వామివారి తీర్థప్రసాదాలను కార్యనిర్వాహణాధికారి వారికీ అందించారు. తరువాత వీరు కొండపి ఉన్న గోల్డ్ స్పాట్ గెస్టుహౌస్ వద్ద దేవస్థానములో విధులు నిర్వహిస్తున్న ఎస్టీ ఉద్యోగుల వివరాలను కార్యనిర్వాహణాధికారి వారిని అడిగారు. అందుకు కార్యనిర్వాహణాధికారి ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్ గా ఓ ఎస్టీ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారన్నారు. సదరు ఉద్యోగి ప్రమోషన్ కు కావాల్సిన అర్హత లేనందున ఆఖాళీ అలా భర్తీ కాకుండా అందని సమాధానం ఇచ్చారు. అందుకు కమిటీ మెంబర్ అయినా ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రమణ్యం , ఎమ్మెల్యే శ్రీమతి ఈశ్వరి ఆఖాళీ అలా ఎవరికీ చెందకుండా ఉండటం మాకు చాలా బాధాకరంగా ఉందని ఈవో తో అన్నారు. కమిటీ అధ్యక్షులు శ్రీనివాసుతో పాటు సభ్యులంతా ప్రస్తుతం ఉన్న ఈవోకు ఆదేశించారు . అదేవిధంగా అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో 30% ఎస్టీ వారికీ అవకాశం కల్పించినందుకు కార్యనిర్వాహణాధికారి వారిని పొగడ్తలతో ముంచేత్తారు . వీరితోపాటు సహాయ డిఇ మళ్ళీస్వరరావు, కార్యనిర్వాహణాధికారులు రాఘవకుమార్, ప్రసాద్, రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రామరాజు (హరి) సూపరిండెంట్లు, ఎఇలు అప్పారావు, తాతాజీ, అకౌంట్ విభాగం మూలా వాసు తదితరులు ఉన్నారు.

# ఆధునిక నాటక రంగంలో బళ్లారి రాఘవ యుగ పురుషుడు



విశాఖపట్నం: ఆంధ్ర ఆధునిక నాటక రంగంలో అపూర్వమైన మార్పుల్ని తీసుకొచ్చి ఒక నవ్య యుగాన్ని సృష్టించి బళ్లారి రాఘవ యుగపురుషులైనారని ముఖ్య అతిధిగా వచ్చిన విజయ నిర్మాణ్ కంపెనీ ఛైర్మన్, కళాపోషకులు డా.ఎస్.విజయకుమార్ గురువారం విశాఖ నాటక కళాపరిషత్ ప్రేమ సమాజంలో నిర్వహించిన బళ్లారి రాఘవ 138వ జయంతి సభలో అన్నారు.

పరిషత్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు కొసనా అధ్యక్షత వహించిన సభలో తొలుత ప్రధాన కార్యదర్శి వర్రె నాంచారయ్య స్వాగతం పలికారు. ఆధునిక నాటక రంగ పురోగమనానికి ఆనాడు రాఘవ చేసిన మార్పుల్ని, సేవలను సభలో గౌరవ అతిధిగా విచ్చేసిన ప్రముఖ సినీ నటులు వంకాయల సత్యనారాయణమూర్తి, పరిషత్ గౌరవ అధ్యక్షులు పి.ఎస్.నాయుడు, డా.వై.హరగోపాల్, ఎల్.ఎస్.నాయుడు, బొమ్మిడి సత్యనారాయణ ప్రభృతులు ప్రసంగించారు.

సభలో ప్రముఖ రంగస్థల నటులు డా.జి.బి.రామకృష్ణ శాస్త్రికి రాఘవ కళా పురస్కారాన్ని ప్రదానం గావిస్తూ ఘనంగా సత్కరించారు. సభకు ముందుగా జరిగిన డా.జి.బి.రామకృష్ణశాస్త్రి, డి.జనార్ధనరావు, కోరుకొండ రంగారావు, ఇమంది ఈశ్వరరావుల ఏకపాత్రాభినయాలు సభికులను అలరించాయి. నిర్వహణలో బి.జగత్‌రావు, కె.వి.శివరామకృష్ణ, ప్రభృతులు సహకరించారు.

### వైన్ షాపుకి వ్యతిరేకంగా పోరాడి

# విజయం సాధించిన సంతోష్ నగర్ మహిళలకు జేజేలు - ఐద్వా



విశాఖపట్నం : తాడిచెట్ల పాలెం, సంతోష్ నగర్ లో నివాస ప్రాంతంలో మద్యం షాపుకి వ్యతిరేకంగా మహిళలు 32 రోజుల పాటు పోరాటం చేసి విజయం సాధించారు. ఈ సందర్భంగా గురువారం సంతోష్ నగర్ లో కొవ్వొత్తులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మహిళలంతా ఐక్యం గా పోరాడితే సాధించలేనిది ఏదీ లేదని సంతోష్ నగర్ మహిళలు మరొక సారి నిరూపించారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ ప్రాంతంలో మద్యం షాపు వల్ల గత రెండు సంవత్సరాలుగా ఎంతో ఇబ్బంధి పడ్డామని, ఈ నాటికి తమ సమస్య తీరిందని సంతోషం వ్యక్తం చేసారు. మద్యం షాపులు ఉన్న ప్రాంతమంతా భయంకర వాతావరణాన్ని తలపిస్తూ ఆదారి వెంట వెళ్ళే మహిళలకు రక్షణ లేని పరిస్థితి ఉండేదని, మహిళలు, అమ్మాయిలను వేధించడం, చున్నీలు పట్టుకుని లాగడం, వారి ఎదురుగానే ఆ ప్రాతమంతా మల,మూత్ర విసర్జనలు చేసి చాలా జుగుప్సాకరంగా ప్రవర్తిచడం నిత్య కృత్యమయ్యేవని అన్నారు. చుట్టుపక్కల నివాస ప్రాంతాలలో ఉన్న వారు తమ ఇళ్ళకు వెళ్ళ డానికి కూడా వీలులేకుండా దారికి అడ్డంగా కూర్చుని మద్యం తాగడం వల్ల మహిళలు, చాలా ఇబ్బందులు పడేవారమని, ఒంటరిగా బయటకు వెళ్ళాలన్నా, ఇంట్లో ఉండాలన్నా రక్షణ లేని పరిస్థితులు ఎదురవుతుండటంతో తప్పని సరై మహిళలు పోరుబాట పట్టామని అన్నారు. ఐద్వా నగర కార్యదర్శి ఆర్. యన్. మాధవి మాట్లాడుతూ మహిళల పోరాటం, యమ్‌యల్‌ఏ చొరవతో సంతోష్ నగర్ లో వైన్ షాపు తొలగించడం జరిగిందని, మరొక సారి ఎవరైనా ఈ ప్రాంతంలో మద్యం షాపు పెట్టాలని ప్రయత్నిస్తే పరిమాణాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ మద్యం పై పోరులో ఐద్వా వారితో పాటు భాగస్వామ్యమై, పోరాటానికి నాయకత్వం వహించిందని, షాపు ని తెరవకుండా ఉదయం నుండి రాత్రి వరకు షాపు వద్దనే మహిళలు బైటాయించారని, వినూత్నమైన రూపాలలో తమ నిరసన తెలియచేసామని అన్నారు. ఈ పోరాటానికి సహకరించి మహిళలకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఐద్వా తరపున ధన్యవాదాలు తెలియచేసారు. రాబోయే కాలంలో మహిళలంతా ఇదే విధంగా తమ సమస్యలను ధైర్యంగా ఎదుర్కో వాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు పట్టాల పంపిణీ పేరుతో విశాఖ వచ్చి కూడా మద్యం కి వ్యతిరేకంగా మహిళలు చేస్తున్న పోరాటాలను కనీసం ప్రస్తావించలేదని, పసుపు కుంకుమలు మహిళలకు పాలథీన్ కవర్లలో వేసి పంచడం కాదని చేతనైతే మహిళల పసుపు కుంకుమలను హరిస్తున్న మద్యాన్ని నిషేధించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అన్నారు. బెల్టు షాపులు రద్దు చేస్తామని గొప్పగా చెప్తున్న ప్రభుత్వం నిబంధలకు వ్యతిరేకంగా ఉన్న మద్యం షాపులపై కూడా చర్యలు తీసుకోవాలని, మద్యాన్ని నియంత్రించాలని, నూతన ఎక్సైజ్ పాలసీని రద్దు చేయాలని, మొబైల్ గా జరుగుతున్న మద్యం అమ్మకాల పై కఠిన చర&ఉలు తీసుకోవాలని, డీ- ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర వ్యాపితంగా ఐద్వా మద్యం పై యుద్ధం చేస్తున్న మహిళలకి అండగా నిలబడుతోందని తెలిపారు. వైన్ షాపు డౌన్ డౌన్ , సాధించాం సాధించాం వైన్ షాప్ తీయించాం, సంతోష్ నగర్ లో ఎవడైనా మళ్ళీ వైన్ షాప్ పెడితే పాతేస్తాం, మహిళలకు రక్షణ కల్పించాలి, మద్యం వద్దు- ఆరోగ్యం ముద్దు, విజయం సాధించిన మహిళలకు జేజేలు అనే మహిళల నినాదాలు ఆ ప్రాంతమంతా మారుమోగాయి. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఆర్.యన్. మాధవి, సంతోష్ నగర్ కాలనీ అధ్యక్షులు అర్జునరావు, ధర్మారావు, కాలీష్, శ్రీనివాస్, ఈశ్వర్రావు, కాదర్, కాలనీ మహిళలు పద్మ, ఈశ్వరమ్మ, నిషా, జ్యోత్స్న, మాధురి, విజయ, ప్యారీ, భవాని, రమణమ్మ, అనసూయ, రమణమ్మ, కిరణ్మయి, విజయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే కాంట్రాక్టు కార్మికులకు సమస్యలు వెంటనే పరిష్కరించాలి




విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాలైన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈస్టకోస్ట్ రైల్వేకు సంబంధించిన కాంట్రాక్టు కార్మికులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. ఈస్టకోస్ట్ రైల్వేకు లాభాలు, దేశవ్యాప్త పేరు ప్రతిష్ఠలు గడించడంలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర కూడా కీలకంగా వుంది. కాని కార్మికుల బ్రతుకులు మాత్రం దినదిన గండంగా వుంది. కార్మికులు చట్టపరమైన సదుపాయాలకు నోచుకోవడం లేదు. అధికారులు దృష్టికి తీసుకువెళ్ళినా స్పందన లేదు. ఈ స్థితిలో కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు, ఏరియర్స్, శెలవులు, ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్, వేజ్‌స్లిప్పులు, సేఫ్టీ పరికరాలు మొదలగు చట్టపరమైన హక్కులు అమలు చేయించాలని కోరుతూ ఈరోజు విశాఖపట్నం డిఆర్ఎం ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ జీవో ప్రకారం 01-04-2017 నుండి అన్‌స్కిల్డ్‌కి రోజుకి రు॥ 448రు॥లు, సెమిస్కిల్డ్‌కి 506రు॥లు, స్కిల్డ్‌కి 593రు॥లు వేతనాలు చెల్లించాలి. 2017 జనవరి 19 నుండి పెరిగిన జీతాలు, ఎరియర్స్ చెల్లించాలి. జీవో అయితే వచ్చింది. కాని ఇంత వరకు మన రైల్వేలో చాలా డిపార్టుమెంట్స్‌లో ఈ జీవోరేట్లు, ఎరియర్స్ ఇవ్వటం లేదు. నిత్యావసరవస్తువుల ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. ఇంటి అద్దెలు, కరెంట్ చార్జీలు, విద్య, వైద్యం, పిల్లల స్కూల్ ఫీజులు పెరుగుతున్నాయి. కాని మనకు మాత్రం పెరిగిన జీతాలను కాంట్రాక్టర్స్ ఇవ్వటం లేదు. కాంట్రాక్టర్స్ చేత జీవోలను అమలు చేయించే బాధ్యత రైల్వే యాజమాన్యానిది. కాని రైల్వే యాజమాన్యం తమకేమి పట్టనట్లు ఉన్నందువల్ల కార్మికులు నష్టపోతున్నారు.

మన వాల్తేరు డివిజన్‌లోని వివిధ విభాగాల్లో వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా పర్మినెంట్ స్వభావం కల్గిన వివిధ క్యాటగిరీస్‌లో పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నారు. ప్రతీ సం॥ వేలాది రూపాయలు మన డివిజన్‌కి లాభాలు తెచ్చేదాంట్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ పాత్ర కూడా అధికంగా వుంది.

యూనియన్ గౌరవాధ్యక్షులు వి.వి.ఎల్.నరసింహులు మాట్లాడుతూ ఎంతో కష్టంతో కాంట్రాక్టుకార్మికులు రైల్వేకి సేవలందించినా హక్కులు, సౌకర్యాలు మాత్రం ఏవి లేనట్లే. చట్టపరంగా కనీసవేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రభుత్వ శెలవులు అన్ని కూడా నిరాకరించబడుతున్నాయి. చట్టపరమైన వాటిని అమలు చేయమని కాంట్రాక్టర్లను అడిగితే యజమానులు చట్టాలేవి అమలు చేయటం లేదుసరికదా ఉద్యోగాల్లోంచితీసేస్తామని బెదిరింపులు, అక్రమంగా పనుల్లోంచి తొలగించటం లాంటి చర్యలవల్ల ఉద్యోగభద్రత కొరవడింది. అనేక విధాలుగా దోపిడికి గురవుతూ అనేక కష్టాలు, కడగండ్లపాలవుతున్నారు.

ఈ కార్యక్రమానికి సిఐటియు విశాఖ నగర కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఈస్టకోస్ట్ రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(సిఐటియు) ప్రధానకార్యదర్శి ఎన్.సింహాచలం, శ్రీకాకుళం జిల్లా సిఐటియు నాయకులు బి.ఎస్.రాజు, జి.ఎర్రయ్య, బి.ఆదినారాయణ యూనియన్ నాయకులు ముత్యాలమ్మ, రాజుతల్లి, గణపతి, శ్రీను, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### జల ఒప్పందాలు నిలిచేనా!?

భారత్, పాకిస్థాన్ మధ్య ఎంత ఉద్రిక్తత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సింధు జల ఒప్పందం నిలబడటం గొప్ప విషయమే. అయితే ఈ ఒప్పందం భవిష్యత్తులో నిలబడటం కష్టమని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో అభిప్రాయపడ్డది. వానలు సరిగా పడని కాలంలో నీటి లభ్యత దాదాపు సగానికి తగ్గుతున్నది. దీంతో నీటి పంపకం కష్టమవుతుందనేది ఒక అభిప్రాయం. నీటి వివాదాలను పరిష్కరించడంలో ఈ ఒప్పందం విఫలమైందని పాకిస్థాన్ ఇప్పటికే ఆరోపిస్తున్నది. భారత్ పాకిస్థాన్ సమగ్ర చర్చలలో సింధు జల వివాదాన్ని కూడా చేర్చాలని పాకిస్థాన్ కోరింది. కానీ ఒకసారి ఒప్పందం నుంచి బయట పడితే మరొకటి కుదుర్చుకోవడం అంత సులభం కాదని భారత్ భావిస్తున్నది. నదీ జలాలు ఇరుగు పొరుగు మధ్య వైషమ్యాలనే సృష్టించాలని లేదు. శాంతి సౌహార్ద్రతలకు, అభివృద్ధికి సంకేతాలుగా నిలువవచ్చు. చరిత్రాత్మకమైన సింధు జల ఒప్పందంపై మనస్పర్థలను తొలిగించుకోవడానికి భారత్, పాకిస్థాన్ దేశాలు తాజా చర్చల్లో పురోగతి సాధించడం హర్షణీ యం. భారత్ కిషన్‌గంగా (జీలం ఉపనది), చీనాబ్ నదులపై కొన్ని పరిమితులతో జలవిద్యు త్ ప్రాజెక్టులను నిర్మించుకోవచ్చునని ఈ చర్చల సందర్భంగా ప్రపంచబ్యాంకు ప్రకటించింది. వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్తాన్ మధ్య కార్యదర్శుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ చర్చలు సౌహార్ద్రపూరిత వాతావరణంలో జరిగాయని, సెప్టెంబర్‌లో మళ్ళా సమావేశం కావడానికి అంగీకారం కుదిరిందని ప్రపంచబ్యాంకు తన ప్రకటనలో వెల్లడించింది. రెండు దేశాల మధ్య ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్తతలు నెలకొని ఉన్న సమయంలో నదీ జలాలపై ఇరు పక్షాలు చర్చించుకోవడమే అభినందనీయం. జమ్మూకశ్మీర్‌లో నిర్మాణం తలపెట్టిన రెండు జల విద్యుత్ ప్రాజెక్టులపైనా పాకిస్థాన్ అభ్యంతరం చెబుతున్నది. కిషన్ గంగా నదిపై నిర్మించే జల విద్యుత్ కేంద్ర నిర్మాణం (330 మెగావాట్లు) 2007లో ప్రారంభమైంది. ఇది గత ఏడాదే పూర్తి కావలసింది. అయితే దీనిపై పాకిస్థాన్ హేగ్ న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. కనిష్ఠ స్థాయిలో జలాన్ని భారత్ జలవిద్యుత్ కోసం మళ్ళించుకోవచ్చునని హేగ్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. చీనాబ్ నదిపై రాత్లే దగ్గర నిర్మించ తలపెట్టిన జల విద్యుత్ ప్రాజెక్టు (850 మెగావాట్లు)పై కూడా పాకిస్థాన్ అభ్యంతరం తెలిపింది. అయితే ప్రపంచబ్యాంకు భారత్ తప్పులేద ని స్పష్టం చేసింది. అయినప్పటికీ సింధు జల ఒప్పందంలోని సంక్లిష్టతల దృష్ట్యా అనేక సాంకేతిక అంశాలు, వ్యాఖ్యానాలు ముందుకు వస్తున్నాయి. సింధునదీ బేసిన్‌లోని ఆరు నదులు టిబెట్‌లో జనించి అరేబియా సముద్రంలో కలుస్తయి. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో సింధు జల ఒప్పందం 1960 సెప్టెంబర్ 19 వ తేదీన కుదిరింది. దీనిపై అప్పటి ప్రధాని నెహ్రూ, నాటి పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకా లు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం తూర్పున ఉన్న రావి, బియాస్, సట్లేజ్ నదులపై నియంత్రణ భారత్‌కు, జీలం, చీనాబ్, సింధు నదులు పాకిస్థాన్‌కు కేటాయింపు జరిగింది. భారత్ పశ్చిమ నదులను కూడా వినియోగించుకోవచ్చునని అంటూనే నిలువపై పరిమితులను ఈ ఒప్పందం నిర్దేశిస్తున్నది. భారత్, పాకిస్థాన్ దేశాలు జలవివాదాన్ని పరిష్కరించుకొని, కాపాడుకుంటున్న తీరు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలను అందుకొంటున్నది. రెండు దేశాల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు కూడా ఈ ఒప్పందం ఉల్లంఘనకు గురికాలేదు. అయితే ఎగువన ఉన్న దేశమైన భారత్ ఏ ప్రాజెక్టు చేపట్టినా తమకు నీటి లభ్యత తగ్గుతుందనే కారణాలను చూపి పాకిస్థాన్ అభ్యంతరాలు చెబుతున్నది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఉసిగొల్పు తున్న నేపథ్యంలో ప్రధాని మోదీ రక్తం, నీరు కలిసి ప్రవహించదు అంటూ తీవ్ర హెచ్చరిక చేశారు. సింధు జల ఒప్పంద కమిషన్ చర్చలకు భారత్ హాజరుకాలేదు. కానీ ఆ తరువాత వివాద పరిష్కారానికి చర్చలకు వెళ్ళాలని నిర్ణయించారు. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంలో గత మార్చిలో రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని పాకిస్థాన్ ప్రపంచబ్యాంకును కోరింది. తటస్థ నిపుణుడిని నియమించమని భారత్ కోరింది. అయితే రెండు దేశాలు భిన్న వాదనలు చేయడంతో ప్రపంచబ్యాంకు విడిగా ఇరుపక్షాలతో చర్చలు జరిపింది. ఈ క్రమంలోనే గత సోమ, మంగళవారాలు వాషింగ్టన్‌లో చర్చలు జరిగాయి. భారత్ జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించుకోవడానికి అనుమతి సాధించింది. భారత్, పాకిస్థాన్ మధ్య ఎంత ఉద్రిక్తత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సింధు జల ఒప్పందం నిలబడటం గొప్ప విషయమే. అయితే ఈ ఒప్పందం భవిష్యత్తులో నిలబడటం కష్టమని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో అభిప్రాయపడ్డది.

## హెచ్1బీ దుర్వినియోగాన్ని అడ్డుకోండి



వాషింగ్టన్: అమెరికాలోని ఔట్‌సోర్సింగ్ కంపెనీలు హెచ్1బీ, ఎల్1 వీసాలను దుర్విని యోగం చేయకుండా అడ్డుకోవాలని ఆ దేశ చట్టసభల ప్రతినిధుల బృందం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ సభ్యుల బృందం ట్రంప్‌కు లేఖ రాసింది. ఔట్‌సోర్సింగ్ సంస్థలు స్థానికులకు బదులుగా విదేశీ ఉద్యోగులను చౌకగా అమెరికాకు తరలిస్తున్నాయని ఆరోపించింది. అమెరికన్ల ప్రయో జనాలను రక్షించేందుకు బిల్లును ప్రవేశపెట్టినట్లు పేర్కొంది.

ఉద్యోగాల భర్తీ సమయంలో స్థానికులకే ప్రాధాన్యమివ్వడంతోపాటు అమెరికన్లను ఉద్యోగాల నుంచి తొలగించి మరొకరికి కట్టబెట్టడాన్ని ఈ బిల్లు నిషేధిస్తుందని తెలిపింది.

50 మంది కంటే ఎక్కువ ఉద్యోగులున్న అమెరికన్ ఔట్‌సోర్సింగ్ సంస్థల్లో 50% కంటే ఎక్కువ మంది హెచ్1బీ, ఎల్1 ఉద్యోగు లుంటే కొత్తగా విదేశీయులను నియమించు కోవడాన్ని ఈ బిల్లు నిషేధిస్తుందని వెల్లడించింది.

## బలగాలను కుదించలేదు



బీజింగ్: సిక్కింలోని డోక్లాంలో తమ సైనికులను 270 నుంచి 40కి తగ్గించామని చైనా పేర్కొనడాన్ని భారత్ తోసిపుచ్చింది. అక్కడి నుంచి భారత బలగాలను కుదించలేదని, ఇరు దేశాలు ఇంకా 400 మంది సైనికుల చొప్పున మోహరించాయని విదేశాంగ శాఖ వర్గాలు వెల్ల డించాయి. డోక్లాం నుంచి భారత సైనికులు బేషరతుగా వైదొలగితేనే సమస్య పరిష్కారమవుతుందని చైనా స్పష్టం చేసింది.చైనా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకునేం దుకు జూన్ 18న సుమారు 270 మంది భారత సైనికులు మా భూభాగంలో 100 మీటర్ల లోనికి చొచ్చుకొచ్చారు. ఆ తరువాత 400 మందికి పైగా సైని కులు అక్రమంగా మూడు గుడారాలు ఏర్పాటుచేసుకుని సుమారు 180 మీటర్లలోనికి చొర బడ్డారు. జూలై చివరి నాటికి 40 మంది భారత సైనికులు, ఒక బుల్‌డోజర్ అక్రమంగా చైనా భూభాగంలో ఉన్నాయి' అని నివేదిక పేర్కొంది. చైనా రోడ్డు నిర్మాణం వల్ల తన వ్యూహాత్మక ప్రయోజనాలు దెబ్బతింటాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.రెండు దేశాల సరిహద్దులపై స్పష్టత ఉన్న ప్రాంతంలోనే ప్రతిష్టంభన నెలకొందని చైనా నివేదిక తెలిపింది. సరిహద్దులను నిర్ధారించిన తరువాత కూడా తమ భూభాగంలోకి భారత సైనికులు చొరబడటం తమ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమే అవుతుందని ఆరోపించింది. సిక్కిం సెక్టార్‌లో చైనా-ఇండియా సరిహద్దు మౌలిక రూపాన్ని మార్చాలని భారత్ ప్రయత్నిం చడం చైనా భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

'ప్రస్తుత వివాదం చైనా- భూటాన్‌లది. ఇందులో భారత్ చేయగలిగేదేం లేదు. చైనా-భూటాన్ సరిహద్దు చర్చలకు అడ్డుపడే హక్కు భారత్‌కు లేదు.తన చట్ట బద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకునేందుకు చైనా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది. భారత్‌తో స్నేహ సంబంధాలు పెంచుకోవడానికి అధిక ప్రాధాన్యమిస్తుంది.

## మధుమేహం అంటువ్యాధా?

### సంక్రమించే అవకాశం ఉందంటున్న టెక్సాస్ వర్సిటీ శాస్త్రవేత్తలు



వేళాపాళా లేకుండా తినడం.. కడుపులో చల్ల కదలకుండా గడిపేయడం.. ప్రతి దానికీ టెన్షన్ పడు తుండడం.. అతిగా మద్యం తాగడం.. ఇవన్నీ మధుమేహానికి (టైప్-2) కారణమని మనకు తెలుసు. కానీ మధుమేహం ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అంటువ్యాధి కావొచ్చని టెక్సాస్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించిన గాలికుంటు వ్యాధి తరహాలో మధుమేహం కూడా సంక్రమించే అవకాశాలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు.

**జనాభాలో ఆరుశాతం**

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) లెక్కల ప్రకారం ప్రపంచ జనాభాలో ఆరు శాతం మంది టైప్-2 మధుమేహంతో బాధపడుతున్నారు. 1985 సమయంలో కేవలం మూడు కోట్ల మంది మాత్రమే ఉన్న మధుమేహ బాధితులు.. 2015 నాటికి 39 కోట్లకు చేరుకున్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పులు.. జంక్‌ఫుడ్.. వ్యాయామలేమి.. పని ఒత్తిడి కారణంగా మధుమేహం బారిన పడుతున్నట్లుగా గుర్తిం చిన వైద్యులు ఈ అంశాల్లో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇక వారసత్వంగానూ మధుమేహం వచ్చే అవకాశం ఉందన్న విషయం తెలిసిందే. కానీ అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఇటీవల జరిపిన ఓ పరిశోధన మరో ఆందోళనకరమైన విషయాన్ని బయటపెట్టింది. పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి తరహాలో... మధుమేహం కూడా ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అవకాశముందని పేర్కొంటోంది.

## ఎలుకల మాంసం.. చికెన్ వింగ్స్‌గా..



వాషింగ్టన్: ఎలుకల మాంసాన్ని అమెరికాలో చికెన్ వింగ్స్ పేరిట రెస్టారెంట్లలో విక్రయిస్తున్నారని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) గుర్తించింది. అయితే కప్ప,ఎలుక, పాములను చైనీయులు లొట్టలేసుకుని తింటున్నట్లు.. అమె రికన్లు తినరనే ఉద్దేశ్యంతో అమెరికా కంపెనీలు ఎలుకల మాంసాన్ని ప్రాసెస్ చేసి చికెన్ వింగ్స్ పేరిట వండి వడ్డిస్తున్నాయి.వీటికి మంచి గిరాకీ లభిం చడంతో చైనా కంటెయినర్ల కొద్దీ ఎలుక మాంసాన్ని అగ్రరాజ్యానికి ఎగుమతి చేస్తోంది. శాన్‌ఫ్రాన్సిస్కో పోర్టులోకి వచ్చిన ఓ కంటెయినర్‌ను ఎఫ్‌డీఏ పరిశీ లించగా దిగ్భ్రాంతికరమైన ఈ విషయం బయటపడింది. ఏటా అక్షరాలా నాలుగున్నర లక్షల కిలోల ఎలుక మాంసాన్ని విక్రయిస్తున్నారని ఎఫ్‌డీఏ ఆందో ళన వ్యక్తం చేసింది. ఎక్కడ పడితే అక్కడ 'బోన్‌లెస్ చికెన్ వింగ్స్' వంటకాలను తినవద్దని ఎఫ్‌డీఏ అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

## సమకవియం

### 'ధరలు ధరువు'

సరైనదా...? సరికానిదా...?
ధరలు ధరువు బరువనీ...
దినం వారి జీవనలో, కూలివాళ్ళు యెలాగనీ...? "స"
ఏమియూ పాలననీ....
సర్కారులు దిగజారుడు తనమనీ...
అడకత్తిరి నొక్కుల్లో, కూలివాళ్ళు జనమనీ...
పుష్టిగ తిండికి నోచుకోలేరనీ... "స"
భాగ్యాలు పుడమిన ఇలాగే మనీ...
సిరిభారతి నేలన యిలాగేలనీ...
పందెంలా పోట్లాటలు పదవులకే...
ఎంతైనా ఖర్చుకి వుందనీ... "స"
దోపిడి వర్గానికి రాజ్యమా...?
బుర్లకొట్టి సంపాదన న్యాయమా...?
ఏమేమి చెపుతారు కాలయాపనా...?
చెప్పినవి యెంతొరకు జరిగెననీ...? "స"
బజారు సంచికి డబ్బేమిన్నా...
ధనమున్న వారికి గొప్ప కాదు, సుమా...
ఒక్కరైన బిడ్డకు - తిండెంతుంది?
తిండిలోన సత్తువే - లేదంటుంది? "స"
ఎన్నెన్నో చూస్తేనే -కడుపు నిండునా...?
కడుపు నిండే రోజులు - ఎప్పుడొచ్చునా...? "స"

... రచయిత
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : ద్వాదశి సా.6:25; మూల రా.9.41 రా.వ.7.54ల 9.41.

శుక్రవారం 04-08-2017

**మేషం** : కోళ్ళ, గొఱ్ఱె, పాడి పరిశ్రమ రంగాలలో వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది. **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. **మిధునం** : చిట్స్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బంది లెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య** : పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ సంతానం విద్య, వివాహ విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం. **వృశ్చికం** : ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం. **ధనుస్సు** : మీరంటే అందరికీ గౌరవం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం ఆర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు. **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభాకాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం. **కుంభం** :భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **మీనం** : ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగు మతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

## అయ్యప్ప చింతనతో ...

## సంకీర్తన


### అయ్యప్ప ఎవరు..!

హరిహర సుతుడుగా అయ్యప్ప అవతరించినట్టు చరిత్ర చెపుతుంది. అయితే ఒకప్పటి కాలానికి వెడితే, విష్ణువుని ఆరాధించే వారిని వైష్ణవులని, శివుణ్ణి ఆరాధించేవారిని శైవులని, బ్రహ్మని ఆరాధించే వారంతా బ్రాహ్మణులని వర్గీకరణ జరిగింది. అయితే శృష్టిస్థితిలయ కారకులుగా రూపుదిద్దుకున్న ఆ పరమేశ్వరుని రూపాన్ని, భగవంతుడు ఒక్కడే అనే నిజాన్ని విస్మరించి, ఈ త్రిమూర్తులలో ఎవరు ఎక్కువ అనే తత్వం ఈ మూడువర్గాల్లోనూ తలెత్తింది.

విష్ణువే ఎక్కువ అని వైష్ణవులు, శివుడే ఎక్కువ అని శైవులు వాదించుకోవడం మొదలు పెట్టి, హత్యలు చేసుకునే స్థితికి చేరుకున్నారు. బ్రాహ్మణులు ఇద్దరి మధ్య మీమాంశలో పడి కొందరు వైష్ణవుల్లోను, అత్యధిక శాతం శైవుల్లోను కలిసిపోయారు. శైవుల మధ్య వైష్ణవుల మధ్య విపరీతంగా పెరిగిపోయిన విబేధాల వల్ల రక్తపాతం జరుగుతూవుండేది.

హిందూ సమాజం అస్తవ్యస్థంగా మారింది. చివరికి విష్ణుభక్తులు పెట్టుకునే నామాలు కూడా శైవులు నాకి అవమానించేవారు. ఆ కోపావేశంలో శైవుల్ని హత్యచేయడానికి విషం కలిపిన నిలువునామాలు పెట్టుకునేవారు.

వీరి నామాలు నాకిన శైవులు విషప్రభావంతో మరణించేవారు. ఎవరికి వారు మా మతం గొప్పదంటే, మా మతం గొప్పది అంటూ ఆధిపత్యపోరు నిరంతరం సాగిస్తూవుండటంతో సమాజంలో



అశాంతి ప్రబలిపోయింది. సాధారణ ప్రజానీకం కూడా ఎవరు ఏమిటో తెలియని వాతావరణంలో కుమ్ములాటలకి దిగడం పరిపాటిగా మారింది.

చివరికి రాజవంశాల్లో కూడా ఇదమిద్ధంగా సరైన అవగాహన లోపించడంతో రారాజులు, మహారాజులు కూడా ఈ విషయంలో నిర్లిప్తధోరణి పాటించారు. సమైక్యతకి కొందరు ప్రయత్నించినా ఫలితం అంతగా కనిపించ లేదు. ఇంతటి అస్థిర పరిస్థితిని అదుపుచేసి, సుస్థిర సమాజస్థాపనకోసం హరిహరులు ఒక్కరే అని చేప్పే నేపథ్యంలో హరిహర సుతుడుగా ఇద్దర్నీ ఏకంచేస్తూ ఉద్భవించినవాడే అయ్యప్ప.

### అయ్యప్ప చరిత్ర

ఏ పురాణేతిహాసాల్లోను మనకి తెలిసినంతవరకూ అయ్యప్ప ప్రస్తావన ఉండదు. అయితే భస్మాసురుని సంహరించడంకోసం శ్రీహరి జగన్మోహినిగా అవతరించడం, భస్మాసురుడికి వరాన్ని అనుగ్రహించి తన నెత్తిమీదికి తెచ్చుకుని కష్టాల్లో పడిన పరమ శివుణ్ణి రక్షించడం, జగన్మోహినిగా ఉన్న శ్రీహరిని చూసి శివుడు మోహించి కొంతకాలం తనతో దాంపత్యం చేయడం, ఆ దాంపత్య కారణంగా ఒక బాలుడు పుడతాడు. అవతార పరిసమాప్తం అవుతున్న సమయంలో ఆ కుర్రవాణ్ణి శివ కేశవులు ఒంటరిగా ఆ అడవిలో విడిచి పెడుతూ, ఇతర జంతు జాలంతో ఇతనికి ఎటువంటి ఆపదా కలుగకుండా రక్షగా మెడలో ఒక మణిని వేసి ఇద్దరు తమ లోకాలకు వెళ్ళిపోతారు. అక్కడితో ఆ ఇతిహాసం పూర్తవుతుంది. అయితే ఆ ప్రాంతాన్ని పరిపాలించే రాజు వేటకు రాగా ఆ అడవిలో హరిహరులకు పుట్టిన కుర్రవాడు ఒంటరిగా దొరకుతాడు.

పిల్లలు లేని ఆ మహారాజు ఆ కుర్రవాణ్ణి దైవప్రసాదంగా భావించి తన రాణి చేతిలో ఉంచి, మణిసహితంగా దొరికిన కారణంచేత మణికంఠుడు అనే నామకరణం చేస్తారు.

యుక్తవయసు వచ్చిన మణికంఠుడికి పట్టాభిషేకం చేయాలన్న తలంపుతో అతనిని సంప్రదించగా...

అందుకు మణికంఠుడు తాను ధర్మసంస్థాపనకోసమే పుట్టిన కారణంచేత, తన తరువాత ఆ రాజదంపతులకు కలిగిన సంతానానికే పట్టాభిషేకం చేయమని, తాను బ్రహ్మచారిగా అడవికి పోయి తన అవతార కార్యక్రమాన్ని నిర్వహిస్తాననీ చెప్పి, రాజ్యత్యాగం చేసి శబరిగిరిని చేరతాడు.అక్కడి నుంచి హరిహర సుతుడుగా, అయ్యప్పగా, ధర్మశాస్తగా పిలవ బడుతూ, అవతార విశేషం పూర్తి అవ్వగానే అదే శబరిగిరి మీద వెలిసి ఇప్పుడు అందరి పూజలూ, సేవలూ అందుకుంటున్నాడు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

SVR గోల్డ్ లోన్స్
మీ బంగారాన్ని బ్యాంక్/ప్రైవేటు సంస్థలలో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటు కంటే ఎక్కువకు కొనబడును.
Contact No: 75696 87774

# వృద్ధులను గౌరవించాలి



వృద్ధులకు పళ్లు పంచుతున్న సిఐ

గరివిడి: అరవై సంవత్సరాలు పై బడిన వృద్ధులను కుటుంబ సభ్యులు ఎంతో గౌరవించాలని చీపురుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్యామలరావు అన్నారు. మండలంలో కోడూమ గ్రామంలో గురువారం సి.ఐ వృద్ధమిత్ర కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు పళ్లు, పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సి.ఐ. మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది తమ కుటుంబంలోని ఉన్న వృద్ధులను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయం మా దృష్టికి వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చ రించారు. వృద్ధులను విలువ కట్ట లేని వ్యక్తులుగా సమాజానికి లభించిన ఆమూల్య మైన ఆస్థిగా ప్రతీ ఒక్కరు భావించాలన్నారు. ప్రతీ వ్యక్తి అరవై సంవత్సరాలు దాటిన తరువాత అనా రోగ్యం, అలసట, మతి మరుపు లాంటి సమస్యలు ఎదుర్కొంటారని ఆ సమయంలో ఆయన కుటుంబ సభ్యులు వృద్ధులకు అండగా నిలవా లన్నారు. వారితో ప్రేమగా మాట్లాడా నలన్నారు. వృద్ధులు అనుభవాలు సమాజానికి ఎంతో దోహద పడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ గ్రామ నాయకులు అడపా సూర్యనారాయణ, గరివిడి పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పక్కా గృహాలు లేని వారి గుర్తింపునకు సర్వే: ఎంపీడీఓ

కొయ్యూరు : మండలంలో పక్కా ఇళ్లు లేని వారిని గుర్తించేందుకు సర్వే చేస్తున్నామని ఎంపిడిఒ ఇమ్మానుయేలు తెలిపారు. ప్రభుత్వం పక్కా గృహాల మంజూరు చేసేందుకు వీలుగా పూరిళ్లలో నివాసించే వారి వివరాలను సేకరించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీ వరకు మండలంలో 33 పంచాయతీల్లో సర్వే చేస్తామని చెప్పారు. తహసీల్దార్, ఎంపిడిఒ, సిడిపిఒ నేతృత్వంలో మూడు బృందాలను ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ సర్వే నిర్వహణకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ బృందాల్లో వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో సర్వే చేస్తారని, అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పిస్తామని చెప్పారు. అలాగే ఈ సర్వేల్లో స్వచ్ఛభారత్ మిషన్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్నామన్నారు.

## స్వచ్ఛంద సేవా ట్రస్టు ప్రారంభం

యలమంచిలి రూరల్ : సమాజ శ్రేయస్సును కోరుతూ యువత సేవా కార్యక్రమాలు చేయడం అభినందించదగ్గ విషయమని ఎంపిడిఒ సందీప్ అన్నారు. యలమంచిలి మండలం పిఎన్ ఆర్‌పేట గ్రామంలోని 15 మంది యువత కలిసి గ్రామీణ స్వచ్ఛంధ సేవా ట్రస్టును ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామస్థులకు అత్యవసరమైన ఉచిత అంబులెన్స్ సర్వీసును ఎంపిడితో ప్రారంభించి సేవా కార్యక్రమాలకు శ్రీకారంచుట్టారు. నిరుపేదలైన 50 కుటుంబాలకు 9 రకాల నిత్యావసర సరుకులతో రేషన్ అందజేశారు. వీరికి ప్రతి నెలా రేషన్ ఇస్తామని తెలిపారు. దీంతో పాటు వాటర్ ట్యాంకర్‌ను విద్యార్థుల కోసం గ్రంధాలయాన్ని ప్రారంభించారు. అందరి సహకారంతో సేవాకార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ ఆత్మ చైర్మన్ కొలుకులూరి విజయ్‌బాబు ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులను అభినందించారు.

## పూలు, పండ్ల వ్యాపారం గిరాకీ

రావికమతం : శ్రావణ మాసం కావడం, శుక్రవారం వరలక్ష్మి వ్రతం కావడంతో పూలు, పండ్ల వ్యాపారాలకు గిరాకీ ఏర్పడింది. మహిళలు అధిక సంఖ్యలో పూలను కొనుగోలు చేయడానికి వస్తున్నారు. రావికమతం, కొత్తకోట తదితర ప్రాంతాల్లో పూల వ్యాపారులు పలు రకాల పూలను తీసుకొచ్చి విరివిగా విక్రయిస్తున్నారు. అదే విధంగా పండ్లు వ్యాపారం కూడా బాగా సాగుతుంది. దీంతో ఇటు పూలు, పండ్ల వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్యపై కేసు నమోదు

కొయ్యూరు : యు.చీడిపాలెం శివారు పలకజీడి గ్రామానికి చెందిన బాకూరి రాములమ్మ ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మంప ఎస్సై శ్రీనివాస్ తెలిఆపరు. ఈ నెల 31న రాములమ్మ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ఆమె మృతదేహానికి గ్రామ పెద్దలు, సర్పంచ్ సమక్షంలో పోలీసులు శవపంచనామా చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అధికారులతో సమావేశమైన పంచకర్ల రమేష్‌బాబు



అచ్యుతాపురం: యలమంచిలి నియోజకవర్గ శాసన సభ్యులు, జిల్లా రూరల్ టిడిపి పార్టీ అద్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు గురువారం ఉదయం వారి క్యాంప్ కార్యాలయంలో అదికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బార్క్, ఎన్.ఎ.ఒ.బి, సెజ్‌కు సంబంధించిన సమస్యలపై చర్చించారు. అలాగే దుప్పితూరు గ్రామం తరలింపు విషయమై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో అనకాపల్లి ఆర్‌డిఒ, ఎన్.ఎ.ఒ.బి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్, ఇర్రిగేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్, అచ్యుతాపురం, రాంబిల్లి తాహశీల్దార్‌లు పాల్గొన్నారు.

## చెంచులను ఎస్టీలుగా గుర్తించాలి

పెద్దాపురం: ప్రభుత్వం రాష్ట్రంలో మిగిలిన జిల్లాలో మాదిరగా ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలలోని చెంచులను ఎస్టీలుగా గుర్తించాలని, చెంచులక్ష్మీ నరసింహస్వామి చెంచుల సంఘం ఐదు జిల్లాల ఉపాధ్యక్షుడు గెడ్డం చిన్నా పిలుపునిచ్చారు. స్థానిక ముప్పన సోమరాజు, వీర్రాజు కల్యాణ మండపంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం గిరిజన ప్రాంత చెంచులనే కాకుండా, మైదాన ప్రాంతంలో ఉన్న చెంచులను కూడా ఎస్టీలుగా గుర్తించి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు పిచ్చయ్య, గౌరవాధ్యక్షులు ఎ.సూరిబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నీలబోతుల పోసయ్య, పల్లయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 11న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

పెద్దాపురం: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఈనెల 11న మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.పుష్పనాధం తెలిపారు. ప్రతి సంవత్సరం సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్రతాలలో పాల్గొన దలచిన మహిళలు 7వతేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## కట్టమూరులో గీతాపారాయణం

పెద్దాపురం: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కట్టమూరు గ్రామంలో గీతా పారాయణం నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ పి.ప్రసాద్ తెలిపారు. గ్రామంలో జోడుగుళ్ళ వద్ద ఉదయం 8 గంటల నుంచి గీతా పారాయణం నిర్వహిస్తారని భక్తులు హాజరు కావాలని కోరారు.

## వంట గ్యాస్‌పై పెంచిన ధరలను తగ్గించాలి




అచ్యుతాపురం: గ్యాస్ సబ్సిడీని కొనసాగించాలని, వంట గ్యాస్‌పై పెంచిన ధరలను తగ్గించాలని సిపిఎమ్ డివిజన్ కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై ప్రతి నెలా రూ॥ 4 పెంపు నిర్ణయాన్ని నిరసిస్తూ గురువారం అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో సిపిఎమ్ ఆద్వర్యంలో నిరసన తెలియజేసారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముడి చమురు ధరలు తగ్గుతున్నా నేటి పరిస్థితుల్లో గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమన్నారు. గ్యాస్ సబ్సిడీ పూర్తిగా ఎత్తివేయడం వలన సామాన్యులకు వంట గ్యాస్ అందుబాటులో లేకుండా పోతుందన్నారు.

ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలు కన్నెర్ర చేయకముందే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎమ్ జిల్లా కమిటీ సభ్యులు కర్రి అప్పారావు, బుద్దా రంగారావు, కొవిరి అప్పలరాజు, చోడిపల్లి అప్పారావు, సోమునాయుడు, శివాజీ, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు గౌరవ వేతనం నిలుపుదల

నర్సీపట్నం : పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్య కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పాఠశాలల్లో మరుగుదొడ్లను పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు ప్రతీ పాఠశాలకు ఒక పారిశుద్య కార్మికుడిని నియమించి వారికి వెలుగు, అటవీశాఖ ఆధ్వర్యంలో వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం మార్గ దర్శకాలు రూపొందించింది.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం వీరికి వేతనాలు నిలిపివేయడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టు మిట్లాడుతున్నారు. వేతనాల నిలిపివేయడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్లా డుతున్నారు. వేతనాలు చెల్లించాలని వెలుగు, అటవీ శాఖాధికారులను విద్యాశాఖాధికారులు కోరుతున్నప్పటికీ నిధులు కేటాయించకపోవడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పారిశుద్య కార్మికులకు సమాధానం చెప్పలేకపోతున్నారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా తయారవుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పలువురు పారిశుద్య కార్మికులు కోరు తున్నారు. పారిశుద్య కార్మికులకు గౌరవ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం నుంచి లిఖిలపూర్వకమైన ఆదేశాలు రాలేదని ఎంఇఒ సాయిశైలజ తెలిపారు.

### తొమ్మిది సంక్షేమ పథకాలైన నవరత్నాలను

## ప్రజలకు చేరువయ్యేలా విస్తృత ప్రచారం



తెర్లాం: విజయనగరం జిల్లాలో తెర్లాం మండల పార్టీ అధ్యక్షులుగా నర్సుపల్లి బాజ్జీరావు, తెర్లాం మండల యువజన విభాగం అధ్యక్షులుగా సేపేన సత్యనారాయణ, రాష్ట్ర పార్టీ మహిళా కార్యదర్శిగా నర్సుపల్లి ఉమాలక్ష్మి పేర్లను పార్టీ కేంద్ర కార్యాలయానికి ఆమోదం నిమిత్తం పంపంచినట్టు వై.యస్.ఆర్. కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బెల్లాన చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకోసం 9 సంక్షేమ పథకాలైన నవరత్నాలను ప్రజలకు చేరువయ్యేలా విస్త్రతంగా ప్రచారం చేయనున్నామన్నారు. వై.యస్.ఆర్ రైతు బరోసా, వై.యస్.ఆర్ ఆసరా ఫించన్ల పెంపు, అమ్మబడి, పేదలందరికీ ఇళ్ళు, ఆరోగ్యశ్రీకి పూర్వవైభవం, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, దశలవారీగా మధ్య నిషేదం లాంటి నవరత్నాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళనున్నామన్నారు. జిల్లాలో 9 నియోజిక వర్గాలలో పార్టీ పటిష్ట వంతంగా ఉందన్నారు. మిగిలిన బూత్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయనన్నాన్నారు. 31/2 ఏండ్ల చంద్రబాబు పాలనలో ప్రజలు విసిగి వేసారి పోయారన్నారు. 2019 ఎన్నికలు నీతికి, అవినీతికి మధ్య జరిగే ఎన్నికలు అని, ప్రజలంతా గమనిస్తున్నారని, రాజన్న రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారని, అధికార తెలుగుదేశం పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

## టీకాలు వేసుకోవాలి



కొండపాలెం పాఠశాలలో టీకాలు వేస్తున్న దృశ్యం

గరివిడి: తొమ్మిది నెలల నుండి 15 సం॥ల మధ్య పిల్లలు తప్పనిసరిగా తట్టు రుబెల్లా టీకాలు వేసుకోవాలని స్థానిక పి.హెచ్.సి వైద్యాధికారి పి. జగదీశ్వరరావు కోరారు. మండలంలో పాత గరివిడి, కొండపాలెం పాఠశాలలో గురువారం విద్యార్థులకు టీకాలు వెసే కార్యక్రమం ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ తట్టురుబెల్లా వ్యాధులు ప్రారంభమైనవి అన్నారు. ప్రభుత్వం ఉచితంగా చేస్తున్న ఈ టీకాలను తల్లిదండ్రులు, పిల్లలకు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్ వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

### క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో

## మోకాలి, తుంటి మార్పిడికి చికిత్సలకు ఆరోగ్య హెల్త్‌స్కీమ్



విశాఖపట్నం: గురుద్వార జంక్షన్ దగ్గర క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో మోకాలి, తుంటి మార్పిడికి సంబంధించిన ఆరోగ్య హెల్త్‌స్కీమ్ అందుబాటులోకి వచ్చిందని సీఈఓ చంద్రమౌళీశ్వరరావు తెలిపారు. గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఆరోగ్య హెల్త్ స్కీమ్ క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి రోగులకు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత 22 సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర ప్రజలకు క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సేవలందిస్తున్నారు. మోకాలి, కీళ్ల నొప్పులు, తుంటికి సంబంధించిన సమస్యలతో బాధ పడు తున్న వారికి మార్పిడి చికిత్సలు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డా.కారుమంచి వసంతబాబు, డా.రేవంత్‌కుమార్, డా.రాజేష్‌బాబు, డా.శరత్‌రాం తదితరులు పాల్గొన్నారు.

# వర్మి కంపోస్టుతో గ్రామాలు పరిశుభ్రం



విజయనగరం: గజపతినగరం మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ సుడిగాలి పర్యటన చేసి పలు క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపారు. ఇందులో భాగంగా ముందుగా గజపతినగరం మండల సమావేశ మందిరంలో నిర్వహించిన ఓడిఎఫ్ గ్రామాల సమీక్షలో పాల్గొన్నారు. అనంతరం గజపతినగరంలో నిర్వహిస్తున్న వర్మి కంపోస్ట్ యార్డును పరిశీలించి కంపోస్టు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త, చెదారాలను యార్డుకు తరలించడం ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. యార్డుకు తరలించిన చెత్త, చెదారాలను వివిధ వర్గాలుగా విభజించి తడి చెత్తను వర్మి కంపోస్టు కుంటలలో నింపి 45 రోజుల్లో ఎరువుగా మార్చి వ్యవసాయానికి సాంప్రదాయ ఎరువుగా వినియోగించడం శుభ పరిణామమన్నారు. ఈ ఎరువు వినియోగంతో పంటలలో పౌష్టికాహార లభ్యతతో పాటు అధిక దిగుబడులు సాధించడమె కాకుండా వ్యవసాయ ఖర్చు తగ్గుతుందన్నారు. వర్మి కంపోస్టును కిలో రూ.15అమ్మడం జరుగుతుందన్నారు. అదే విధంగా పొడి చెత్తను అమ్మకం ద్వారా కూడా పంచాయితీలకు ఆదాయ వనరుగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా అన్న అమృతహస్తం పథకం కింద సరఫరా అయిన వంట పాత్రలను అంగన్వాడీ కేంద్రానికి కలెక్టర్ అందజేశారు. అనంతరం మండలంలోని కెఎస్ఆర్ పురం గ్రామంలో వ్యవసాయ భద్రతా పథకం కింద చేపట్టిన వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ డ్రమ్ సీడర్ విధానం ద్వారా లేబరు ఖర్చు తగ్గి సరైన మోతాదులో విత్తు నాటడానికి సమయం తగ్గుతుందని, క్రమ పద్ధతిలో నాటే అవకాశం కలగటంతో పాటు అధిక దిగుబడి లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ యాంత్రీకరణ వైపు రైతులు మొగ్గుచూపేలా అవగాహన కల్పించాలన్నారు. అయితే గజపతినగరం మండలంలో 22 పంచాయితీలలో 20 పంచాయితీలు వర్షాధారమని, ఎనిమిది పంచాయితీల పరిధిలో మాత్రమే నీటి లభ్యత ఉందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువస్తూ ఈ నెలాఖరులోగా సరిపడా వర్షం కురువకపోతే ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పెసర, మినుము పండిస్తామని, వాటిని సబ్సిడీపై అందించాలని కోరారు. ఈ సందర్భంగా శతశాతం సబ్సిడీతో జింక్ ఎరువును లబ్ధిదారులకు కలెక్టర్ అందజేశారు. ఈ పర్యటనలో గజపతినగరం ఎంపిపి, ప్రత్యేకాధికారి, ఎంపిడిఒ, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు లీలావతి, వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు జివి లక్ష్మి, ఉద్యాన శాఖాధికారి మణిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌జిఆర్ పట్టా పడిపోయింది

యానాం, దరియాలతిప్పకు చెందిన గిడ్ల పద్మావతి, W/o.గిడ్ల వీరబాబుకు చెందిన ఎల్‌జిఆర్ ఇంటిపట్టా 186/2004-2005 పడిపోయింది. ఈ జూలై 24వ తేదీన ఇంటివద్దనుండి ఆదిద్రావిడ గృహ ఋణం కొరకు దరఖాస్తు చేసుకొనేందుకు వస్తుండగా ఏటిగట్టు రోడ్డు మార్గంలో కురసంపేట సమీపంలో పడిపోయింది. ఇది ఎవరికైనా దొరికియెడలా ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం.

గిడ్ల పద్మావతి,
W/o. గిడ్ల వీరబాబు,
డోర్‌నెంబర్ 5-3-120,
దరియాలతిప్ప,
యానాం.
సెల్‌నెంబర్
9640480783

### ఇంటి పట్టా పడిపోయింది

యానాం దరియాలతిప్పకు చెందిన కమిడి వెంకటలక్ష్మి, W/o.వీరవెంకట రమణమూర్తికు చెందిన ఎల్‌జిఆర్ పట్టా నెంబర్ 187/2004- 2005 పట్టా పడిపోయింది. ఈ జూలై 26వ తేదీన దరియాలతిప్ప నుండి రోడ్డు మార్గంగా వస్తుండగా పడిపోయింది. ఆఫీసు నిమిత్తం జెరెక్స్ తీయించుటకు వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఇది ఎవరికైనా దొరికినయెడలా ఈ క్రింది చిరునామాకు తెలియచేయగోరుచున్నాం.

కమిడి వెంకటలక్ష్మి
W/o.కె. వీరవెంకట రమణమూర్తి,
డోర్‌నెంబర్ 5-4-003,
దరియాలతిప్ప, యానాం.
సెల్ నెంబర్
9959379697

# టేబుల్ టెన్నిస్ పోటీ విజేతలు వీరే



యానాం : స్థానిక జీఎంసి బాలయోగీ క్రీడామైదానంలో జరుగుతున్న జోనల్ గేమ్ టేబుల్ టెన్నీస్ పోటీల్లో పలు పాఠశాలల జట్లు విజేతలుగా నిలిచాయి. అండర్ 14 - 17 బాలుర విభాగాల్లో, అండర్ 14 బాలుర విభాగంలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రథమ, మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానాలు గెలుచుకున్నాయి. అండర్ 17 బాలురవిభాగంలో రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రథమ, గిరియం హైస్కూల్ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నట్లు విద్యాశాఖ అధికారి కాలే శాయినాద్ తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు.

# కామన్ సర్వీస్ సెంటర్‌కు ఇంటర్వ్యూలు

యానాం : వివిధ ప్రభుత్వ శాఖల నుండి ప్రజలకు సేవలు అందించేందుకుగాను ఏర్పాటుచేయనున్న కామన్ సర్వీస్ సెంటర్ కొరకు అర్హులైన అభ్యర్థులకొరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గురువారం ఉదయం పరిపాలనాధికారి కార్యాలయంలో 17 మంది దరఖాస్తు చేయగా 14 మంది హాజరయ్యారు. ఇప్పటికే 8 సెంటర్లు ఉండగా మరో రెండు సెంటర్లను ఎంపిక చేసేందుకు పరిపాలనాధికారి కార్యాలయంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు అధ్యక్షతన పుదుచ్చేరి కలెక్టర్ సత్యేంద్రసింగ్ దురసాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభ్యర్థులతో మాట్లాడారు. ఎంపిక వివరాలను మరో ఐదు రోజుల్లో వెల్లడించనున్నట్లు పరిపాలనాధికారి తెలిపారు.

**హుటాహుటిన పుదుచ్చేరి బయలుదేరి వెళ్ళిన పరిపాలనాధికారి**

పుదుచ్చేరి ఎన్నికల అధికారి ఆదేశాలమేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు హుటాహుటిన పుదుచ్చేరి బయలుదేరి వెళ్ళారు. గురువారం మధ్యాహ్నం కామన్ సర్వీస్ సెంటర్ ఇంటర్వ్యూలు ముగిసినవెంటనే పుదుచ్చేరి బయలుదేరి వెళ్ళారు. శుక్రవారం పుదుచ్చేరి ఎన్నికల ప్రధాన కార్యాలయంలో జరగనున్న సమావేశానికి హాజరవుతారు. సమావేశం ముగిసినవెంటనే తిరిగి యానాం రానున్నట్లు ఆయన తెలిపారు.

# పలకలు,చాపల పంపిణీ



తాడికొండ : మండల కేంద్రమైన తాడికొండలోని వైసీ కాలనీలో గురువారం "ప్రపంచ తల్లిపాల వారోత్సవాల"లో భాగంగా అంగన్‌వాడి కేంద్రంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న తాడికొండ యమ్‌పిపి షేక్ రిజ్వానా మాట్లాడుతూ తల్లిపాలు విశిష్టమైనవని పిల్ల ఎదుగుదలకు పోషకాలను అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడికొండ గ్రామ సర్పంచ్ నూతక్కి నవీన్‌కుమార్, రూరల్ బ్యాంక్ అధ్యక్షులు కంతేటి నాగేశ్వరరావు, అంగన్‌వాడి కేంద్రాల సూపర్‌వైసర్ నిర్మలా, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయన్‌యమ్ విజయలక్ష్మీ ఆర్ధిక సహాయంతో పిల్లలకు పలకలు, చాపలను పంచిపెట్టారు.

# కాపు నాయకులను, మహిళలను అడ్డుకున్న పోలీసులు



ఆలమూరు : కాపు ఉద్యమనాయకుడు ముద్రగడ పద్మనాభం పాదయాత్రకు మద్ధతుగా గురువారం ఆలమూరు శ్రీకృష్ణదేవరాయ కాపు అభ్యుదయ సంఘం మండలాధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, గ్రామ అధ్యక్షుడు చల్లా నానాజీల ఆధ్వర్యంలో కాపు నాయకులు, మహిళలుతో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా కాపు నాయకులు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం పాద యాత్రకు అనుమతి ఇవ్వాలని, కాపులకు ఇవ్వవలసిన రిజర్వేషన్లపై చంద్రబాబు నాయుడు మొండివైఖరి విడనాడి, తక్షణం కాపులకు న్యాయం చేయాలని, డిమాండు చేసారు. ఈ నిరసన కార్యక్రమంలో కాపు నాయకులు చల్లా భూషణం, ఎలుబండి సాయిబాబు, శ్రీపతి సూర్యనారాయణ, నామన దుర్గాప్రసాద్, కాసాని పట్టాభి, ఎలుబండి చంటి, కోలా వెంకటేశ్వరరావు, తాకాసి సత్తిబాబు, వెంపల సత్తిబాబు, చల్లా భాస్కరరావు, సుందర బూరయ్య, కొమ్మిశెట్టి తాతారావు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

# వంటగ్యాస్ రాయితీ తగ్గించడం తగదు

తాళ్లరేవు : ప్రతీనెల గ్యాస్ సిలిండర్ ధరను 4 పెంచుతూ వంటగ్యాస్‌పై రాయితీని పూర్తిగా ఎత్తివేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం మండలి శాఖ డిమాండ్ చేసింది. సీతారాం పురంలో వల్లు రాజబాబు అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ మండల శాఖ సమావేశంలో కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ పేదలపై భారం మోపే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. గ్యాస్ నిక్షేపాలు రాష్ట్రంలో అధికంగా ఉన్నా ఈ విధంగా గ్యాస్‌పై రాయితీ తగ్గించడం దారణం అన్నారు. ఈ సమావేశంలో డి. అదృష్టదీపుకుడు, ఏళ్ళ శేషారావు, ఎ. అప్పయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రత్నకుమారికి డాక్టరేట్



కాకినాడ : పరిశీలకుల బృందం సిఫార్సు మేరకు యు.వి.రత్న కుమారి సిద్ధాంత వ్యాసం ఇన్వెస్టిగేషన్స్ ఆన్ యూనిఫామ్ అండ్ నాన్ యూనిఫామ్ ఎరేయ్స్ జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో లభించినది. యు.వి.రత్నకుమారి తన సిద్ధాంత వ్యాసాన్ని విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలోని ఏయు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసిఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా.జి.ఎస్.ఎన్.రాజు మరియు అమలాపురంలోని బివిసి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు సైన్స్ ప్రిన్సిపాల్ డా.జి.ఎం.వి.ప్రసాద్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు. ప్రస్తుతం యు.వి.రత్నకుమారి గారు కాకినాడ జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ నందు ఈసిఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

# చెత్త కుండీల ఏర్పాటు

తాడికొండ : తాడికొండ మండల పరిధిలోని ఫణిధరం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను,పరిశుభ్రతను కాపాడాలని తెలియచేస్తూ గ్రామంలో చెత్త కుండీలను ఏర్పరిచినట్లు గ్రామ సర్పంచ్ దివి శ్రీనివాసాచార్యులు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకల సాంబశివరావు,పంచాయితీ సెక్రటరీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

## -ఆదిత్య వైస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి

కాకినాడ : భావిభారత పౌరులు ,విద్యార్థులు డ్రగ్జ్ మహమ్మారికి దూరంగా ఉండాలని ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి అన్నారు. డ్రగ్స్ దుష్పరిణామాణాలపై అవగాహన సదస్సులో సతీష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్‌కు యువత భానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, విద్యర్థులంతా మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలని సూచించారు. యావత్ ప్రపంచాన్ని మత్తు పదార్ధాలు పట్టి పీడిస్తున్నాయన్నారు. డ్రగ్స్ మహమ్మారిని దేశంనుండి తరిమి కొట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 15-25 వయస్సుగల యువత ఎక్కువగా మత్తుకు బానిసలు అవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ప్రిన్సిపాల్ ప్రొ.ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ యువతీయువకులు ఆరోగ్యంగా జీవించినప్పుడు మాత్రమే దేశం ఆదర్శ వంతంగా మారుతుందన్నారు. అనంతరం విద్యార్థులచే మత్తు పదార్ధాలకు బానిసలంకామని, ఎవరినీ బానిసలుగా కానీయమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ మహలక్ష్మీదేవిగా వనదుర్గమ్మ అమ్మవారు

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరిపై వేంచేసిన వనదుర్గమ్మ అమ్మవారు శ్రావణమాసము జాతర సందర్భంగా ఈ రోజు అమ్మవారు శ్రీ మహలక్ష్మీ అమ్మవారుగా దర్శనము ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు గ్రామస్థులు ఆలయ ఈవో ఈరంకి.జగన్నాధరావు తదితరులు అమ్మవార్ని దర్శించారు.

# నవీన్ ఎంపిక అప్రజాసామికం: వైఎస్ఆర్ సిపీ

కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ గా జోతుల నవీన్ ఎంపిక అప్రజా సామికమని వైఎస్ఆర్ సిపి పేర్కొంది. గురువారం కలెక్టరేట్‌వద్ద సగ్గంపేట వైఎస్‌ఆర్సి ఇపి నాయకుడు ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సంధర్భంగా వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు మాట్లాడుతూ పార్టీ పిరాయించినవారికి అధికారం కట్టబెట్టడం అప్రజాసామికమాన్నారు. ఈ సంధర్భంగా నవీన్ ఎంపికను తప్పు పట్టారు. గెలుపొందిన పార్టీని వీడి అధికార పార్టీలో చేరి పదవులు అనుభవించడం సిగ్గుచేటన్నారు.

# యానాం నుండి ఆర్టీసీ బస్సులు నడపాలి

యానాం : యానాం నుండి అనునిత్యం ఇతర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసి బస్సులను ఏర్పాటుచేసేలా రాజమండ్రి జోనల్ అధికారి చర్యలు చేపట్టాలని శ్రీకృష్ణాచంద్రకళా నాట్యమండలి అధ్యక్షులు కోరుకొండ ప్రసాదరావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఆర్టీసీ జోనల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు యానాం నుండి కాకినాడ, ముమ్మడివరం, ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు వెళుతున్నారని వారికి సరైన సమయంలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉదయం 8 గంటల నుండి బస్సు స్టాప్‌ల్లో పడిగాపులుపడి క్రిక్కిరిసి వెళ్ళుతున్నారని దీనివలన ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. వికలాంగులుకూ ఇదేపరిస్థితి ఏర్పడుతున్నాయన్నారు. అలాగే ప్రయాణీకులు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు వెళ్ళేటప్పుడు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైల్వే లిం క్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కాకినాడ నుండి అమలాపురం వెళుతున్న నాన్‌స్టాప్ బస్సులను యానాం సరిహద్దులో మూడు నిమిషాలు ఆపేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. గతంలో యానాం వారధిపై బ్రిడ్జి నిర్మించక ముందు కాకినాడ నుండి యానాం వరకు బస్సులు నడిచేవని వాటిని తొలగించిన తరువాత యానాం నుండి వెళ్ళే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటిని దృష్ఠిలో పెట్టుకొని యానాం నుండి ఇతర ప్రాంతాలకు వెళ్ళే విధంగా బస్సు సౌకర్యం కల్పించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం



తాడికొండ : మండల కేంద్రమైన తాడికొండలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారిఆలయంలో స్వామివారి భక్తబృందం ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు ఎర్రమనేని వాసుదేవరరావు, చిటినేని సుబ్బారావు, కాలారి రమేష్, ఎర్రమనేని రాము, యమ్‌పిటిసి అప్పారావు, ఆలయ అర్చక స్వామి, నవ్యాంధ్రప్రదేశ్ అర్చక శ్రేయో పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కె ఎన్ కె శర్మ, దేవాలయాల కార్యనిర్వహణాధికారి జెవి నారాయణ, ప్రముఖ రియలెస్టేట్ వ్యాపారి ప్రధాన విరాళ దాత దొడ్డా సురేంద్ర,శ్రీ ఆళ్ళ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 6న సామూహిక అనసూయా వ్రతం



కాకినాడ : జిల్లేళ్ళమూడి అమ్మ చరణ సేవా సమితి ఆద్వర్యంలో ఈనెల 6న శశికాంత్ నగర్‌లోవున్న సహకార శ్రీనియం (ఆర్.టి.ఓ.) ఆఫీస్ వద్ద ఉదయం 9.30 గం॥ నుండి సామూహిక అనసూయా వ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధి కనకరాజు తెలిపారు. విశ్వజననీ మాసపత్రిక సంపాదకులు పి.ఎస్.ఆర్. ఆంజనేయప్రసాద్ (జిల్లేళ్ళమూడి) స్వీయ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయనతెలిపారు.

ఆత్మీయ అతిధులుగా జిల్లేళ్ళమూడి అమ్మ ఆస్థాన గాయకులు రావూరి ప్రసాద్ జిల్లేళ్ళమూడి దేవాలయ కార్యనిర్వాహణాధికారి వల్లూరి రమేష్‌బాబులు పాల్గొంటున్నారని. చాగంటి వెంకట్రావు, బి.ఎల్. ఎన్. శాస్త్రి ఆశీస్సులతో అనసూయా వ్రతకార్య క్రమాన్ని అనసూయా వ్రత కార్యక్రమాన్ని భక్తుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఈ వ్రతంలో పాల్గొనే భక్తులకు అవసరమైన పూజాసామగ్రి అంతా సమితి కమిటీ సభ్యులే ఏర్పాటుచేస్తారని వివరించారు. ఇతర వివరాలకు 9848290930లో సంప్రదించవచ్చని కోరారు.

# శ్రావణ శోభ సంతరించుకున్న మార్కెట్లు

రావులపాలెం : శ్రావణమాసమంతా శుభ కార్యాలే. ఆ సందడంతా మహిళలదే. శ్రావణ శుక్రవారం రోజున మహాలక్ష్మిని పూజించడం ద్వారా దీర్ఘ సుమంగళిగా ప్రాప్తం చేకూరుతుందని, శ్రావణ మాసంలో వచ్చే రెండో శుక్రవారం రోజున మహిళలు నిష్టతో పూజిస్తే సిరి సంపదలు సంప్రాప్తిస్తాయని మహిళల విశ్వాసం. ముఖ్యంగా శ్రావణ రెండో శుక్రవారం మహిళలు వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకుంటారు. నేడు శ్రావణ శుక్రవారం సందర్భముగా గురువారం రావులపాలెం రింగ్ రోడ్, ప్రధాన మార్కెట్లు జన సంద్రమయ్యాయి. మహిళలకు ముఖ్యమైన పండుగ శ్రావణ లక్ష్మీ వరలక్ష్మి పూజల నేపద్యంలో పూల మార్కెట్లు, పండ్ల మార్కెట్లు కొనుగోలు దార్లతో నిండిపోయాయి. ఇప్పటికే పూలు, పండ్లు, కొబ్బరి ధరలు ఆకాశాన్నంటాయి. ఎటువంటి అవాంచ నీయ సంఘట నలు జరగకుండా ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ తమ సిబ్బందితో ప్రత్యేక దృష్టి సారించారు.

# సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరు కావాలి

## – శాసన మండలి ఉపాధ్యక్షుడు ఆర్.ఎస్.




ఆలమూరు : సమావేశానికి సభ్యులు హాజరు కావాలని శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం ఆలమూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఎంపిపి కొత్తపల్లి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న శాసన మండల ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమావేశానికి విధిగా ఇచ్చిన సమయానికి హాజరు కావటంపై, అలాగే సమావేశానికి అధికారులు కూడా సమయానికి పూర్తి సమాచారంతో హాజరై గౌరవ సభ్యులు అడిగే సమస్యలకు సవివరంగా తెలియజేయాలని, సమావేశ నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు గురించి, ఇటు గౌరవ సభ్యులకు, అటు అధికారులకు ఆయన వివరించిన తీరుకు అధికార ప్రతిపక్ష సభ్యులలో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. అయితే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి నిర్వహిస్తున్న కార్యక్రమాలపై వివరిస్తున్నప్పుడు సంతృప్తి చెందని పలువురు అధికారులపై ధ్వజమెత్తిన తీరు, సస్పెండ్ చేయిస్తా, ఏజన్సీ ప్రాంతాలకు బదిలీ చేయిస్తా అన్న మాటలకు పలువిమర్శలు చోటు చేసుకున్నాయి. ఈక్రమంలో కొత్తూరు-వెదురుమూడి రోడ్డు ప్రక్క చింతలూరు పంచాయితీ పరిధిలో గుడికి, బడికి సమీపంలో బ్రాందీ షాపులు ఏర్పాటుపై ఏక్సైజ్ అధికారుల తీరుకు సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కొత్తూరి వీరన్ననాయుడు, చింతలూరు సర్పంచ్ గెద్దాడ వెంకటనారాయణమూర్తి తదితర సభ్యులు ధ్వజమెత్తారు. దీంతో ఇన్‌ఛార్జి ఎక్సైజ్ సి.ఐ. లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలకు లోబడి అక్కడ షాపులను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించగా దానిపై శాసనమండల ఉపాధ్యక్షుడు రెడ్డి నిబంధనలు కాపీ అడుగగా తీసుకురాలేదని చెప్పడంతో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉన్నతాధికారులతో మాట్లాడి దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని సుబ్రహ్యణ్యం సభ్యులకు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి దండంగి మమత రామారావు, ఎంపిడిఓ నాతి బుజ్జి, తహశీల్దార్ కె.పద్మావతి, మండల ఉపాధ్యక్షుడు గుత్తుల శ్రీనివాసు, ప్రతిపక్ష నాయకుడు రాయుడు లక్ష్మణరావు, ఆలమూరు సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్, ఎంఈఓ ఐ.రాజేశ్వరరావు, ఎలక్ట్రికల్ జి.వి.ఆచారి, ఏ.ఓ. కె.వి.ఎన్.రమేష్ కుమార్, హౌసింగ్ ఏఈ ఎస్.జెజిబాబు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# 7న చంద్రగ్రహణం - ప్రత్యేక ఏర్పాట్లు

కాకినాడ : ఆగష్టు 7న శ్రావణ పౌర్ణమి సోమవారం చూడామణినాయక కేతుగ్రస్త ఖండగ్రాస "చంద్ర" గ్రహణం. శ్రవణానక్షత్రములో సంభవిస్తుందని ఈ సందర్భంగా చేపట్టవల్సిన కార్యక్రమాలను మాధ్వపురోహితులు యాతగిరి మధ్వేష్ తెలిపారు. ఆరోజు రాత్రి స్పర్శకాలం గం 10.53 ని॥, మధ్యకాలం రాత్రి గం 11.50 ని॥, మోక్షకాలం రాత్రి గం 12.48 ని॥, పర్వకాలం 1గం॥ 55 ని॥లు, వేధారంభం మధ్యాహ్నం 11.30 నుండి కనుక అంతకన్నాముందు నిత్యస్నాన పూజాదికాలను నెరవేర్చుకొని భోజనం చేయవలెను. ఆబ్ధీకాది కార్యక్రమాలుకూడా వేధ ముందే పూర్తిచేయాలి. తరువాత భోజనం చేయకూడదు. రాత్రి బోజనం చేయకూడదు. గ్రహణానంతరం స్నానంతో సరిపెట్టుకొని ఉదయం తెల్లవారు ఝామున యధావిధిగా దేవుని పూజ కార్యక్రమాలతోపాటు భోజనం చేయవలెను.

శుభఫలం : మేష, సింహ, వృశ్చిక, మీనం,

మిశ్రమఫలం : వృషభ, కర్కాటక, కన్య, ధనస్సు

అశుభఫలములు : మిధున, తుల, మకర, కుంభాలు, మకరరాశి శ్రవణానక్షత్రంవారికి విశేష నష్టము, అరిష్టపరిహారార్థం విశేషంగా జప దానాదిరూపక శాంతి చేయించుకోవాలి. గ్రహణ కాలమునందు స్నానము, మధ్య కాలమునందు జపము, మోక్ష కాలమునందు మళ్ళీ స్నానముచేయాలి. ఉత్తరాషాఢ, శ్రణం, ధనిష్ఠ (మకరరాశి) నక్షత్రలు, వార్కి దోషం, శాంతి చేసుకోవలెను. శుభఫలరాసులతోపాటు మిగిలిన రాశులలోవున్న నక్షత్రాలు కలిగిన వారు గ్రహణ సమయంలో జపం, దైవ ప్రార్ధన చేసుకోవడం చాల ఉత్తమం.

గ్రహణ దోషం కోసం స్థానిక కాకినాడ గొడారిగుంటలో నున్న శ్రీ ఉత్తరాధి మఠాధీసులు శ్రీ సత్యప్రమోదతీర్థ కరకమల ప్రతిష్ఠ సత్యదేవ మందిరంలో జపాలు, హెూమాలు, నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరాలకు 9640662837 లో సంప్రదించాల్సిందిగా కోరారు. వెండితో చంద్రబింబము, బంగారుతో నాగబింబము చేయించి వాటిని నేతితో నింపిన కంచుపాత్రలో ఉంచి, బియ్యం, ఉలవలు వస్త్ర దక్షణలతో గ్రహణ మధ్యకాలానంతరం దానం చేయవలెను.

# చిత్రభాను

## వావ్.. కూతురిని మించిన అందం..



యువ హీరోయిన్లకు తానేమీ తక్కువ కాదనే రేంజ్‌లో సీనియర్ నటి శ్రీదేవి అందం ఉట్టిపడుతున్నది. కెరీర్ మంచి ఉన్నత స్థితిలో ఉండగానే వైవాహిక జీవితం కోసం శ్రీదేవి నటనకు తాత్కాలికంగా స్వస్తి చెప్పిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత శ్రీదేవి ఇంగ్లీష్ వింగ్లీష్ చిత్రంతో రి ఎంట్రీ ఇచ్చి అభిమానులను ఆకట్టుకొన్నది. ఇటీవల వచ్చిన మామ్ చిత్రంలో నటనతో అందాల తార అదరగొట్టేసింది. ప్రస్తుతం మామ్ సక్సెస్ తర్వాత కూతురు జాహ్నవితో కలిసి శ్రీదేవి అమెరికాలో పర్యటిస్తున్నది. ఈ పర్యటనకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా అది వైరల్‌గా మారింది.

ఆ ఫోటోను అభిమానులు లైకులతో ముంచెత్తుతున్నారు.

మామ్ చిత్రంతో మళ్లీ వెండితెర మీద మెరిసిన శ్రీదేవికి 53 సంవత్సరాలు. అయినా అందంలో ఏమాత్రం వన్నెతగ్గలేదు. కూతురు పక్కన ఉన్న శ్రీదేవి ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఆమెను చూస్తే యువ హీరోయిన్‌లా కనిపిస్తున్నది. ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్ చిత్రాల సక్సెస్ తర్వాత శ్రీదేవి మంచి జోరు మీద ఉన్నది. అమెరికా విహారయాత్ర నుంచి తిరిగి రాగానే మరో చిత్రానికి పచ్చజెండా ఊపడానికి సిద్ధంగా ఉన్నట్టు బాలీవుడ్ పత్రికల కథనం.

తన చిత్రాలకు ప్రేక్షకాదరణ ఎక్కువగా ఉండటంతో వరుస చిత్రాలను చేయాలని శ్రీదేవి నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

ఇదిలా ఉండగా, శ్రీదేవి కూతురు జాహ్నవి బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమవుతున్నది. కరణ్ రూపొందించే సినిమాలో బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ సోదరుడు ఇషాన్ ఖట్టర్‌తో జతకట్టనున్నది. ఈ చిత్రం ది ఫాల్ట్ ఇన్ ఆవర్ స్టార్స్ అనే చిత్రానికి రీమేక్.

## 200 మందికి బంగారు నాణాలు పంచిన హీరో

ఈ మధ్య కొంత మంది స్టార్ హీరోలు తమ సినిమా కోసం కష్టపడ్డ దర్శకులకు, సంగీతం అందించిన వారికి ఇతర టెక్నీషియన్స్ గొప్ప గొప్ప బహుమతులు అందిస్తున్నారు. ఇప్పటికే తెలుగు లో ఎన్టీఆర్, మహేష్ బాబు, రాంచరణ్ లాంటి హీరోలు ఇలాంటి బహుమతులు అందించిన విషయం తెలిసిందే. తన సినిమా యూనిట్ సభ్యులకు ఏదో ఒక గిఫ్ట్ ఇవ్వడం కోలీవుడ్ హీరో విజయ్ కు ఉన్న అలవాటు. గతంలో పులి సినిమా సందర్భంగా 265 మంది యూనిట్ సభ్యులకు బంగారు నాణేలు గిఫ్ట్‌గా ఇచ్చాడు విజయ్.




అదే తరహాలో విజయ్ మరోసారి తన తాజా చిత్ర యూనిట్ సభ్యులకు బంగారు నాణేలు బహుమతిగా ఇచ్చాడు. తాజాగా హీరో విజయ్ తన ప్రాజెక్ట్ కోసం కష్టపడిన చిత్ర యూనిట్ సభ్యులకు బహుమతులు ఇచ్చి సర్‌ప్రైజ్ చేశాడట.

## బూమ్ బూమ్ సాంగ్ కేక....



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకు క్రేజ్ ఏ రేంజిలో ఉందో మరోసారి రుజువైంది. ఆయన నటిస్తున్న 'స్పైడర్' మూవీ ఎప్పుడొస్తుందా అని ఆకలితో ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ ఆ సినిమాకు సంబంధించి ఏది రిలీజైనా నమిలేస్తున్నారు. సినిమా ప్రమోషన్లో భాగంగా 'బూమ్ బూమ్' అనే సాంగ్ బుధవారం సాయంత్రం రిలీజ్ చేశారు. ఈ సాంగుకు ఊహించని స్పందన వచ్చింది. కొన్ని గంటల్లోనే మిలియన్ మార్క్ రీచ్ అయింది. 24 గంటలు గడిచేలోపు రికార్డ్ వ్యూస్ ఖాయం అంటున్నారు విశ్లేషకులు. బూమ్ బూమ్' సాంగ్ సినిమాపై అంచనాలు మరింత పెంచింది. ఈ చిత్రంలో మహేష్ బాబును దర్శకుడు మురుగదాస్ సరికొత్తగా ప్రజంట్ చేశాడు. అదిరిపోయే యాక్షన్ సీన్స్, ఊహకందని ట్విటస్టులతో సినిమా ఉండబోతోంది. తెలుగు, తమిళంలో స్పైడర్' చిత్రం తెరకెక్కుతోంది. ఏది రిలీజ్ చేసినా రెండు వెర్షన్లలో రిలీజ్ చేస్తున్నారు. తాజాగా బూమ్ బూమ్' సాంగ్ తెలుగు, తమిళం రెండు భాషల్లో విడుదల చేశారు. తమిళంలో కూడా ఈ పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకు డిమాండ్ కూడా భారీగా ఉంది.



## ఆయనకు యాక్టింగ్ నేర్పించలేదు.. రకుల్ ప్రీత్ సింగ్

వరుస విజయాలతో అందాల తార రకుల్ ప్రీత్ సింగ్ దూసుకెళ్తున్నది. టాలీవుడ్‌లోనే కాదు.. తమిళ, హిందీ సినీ పరిశ్రమలో అవకాశాలను దక్కించుకొంటూ అగ్రతారగా మారింది రకుల్ ప్రీత్ సింగ్. రారండోయ్ వేడుక చూద్దాం చిత్రంలో భ్రమరాంబ పాత్రలో సినీ అభిమానులను ఆకట్టుకొన్న రకుల్ ప్రస్తుతం జానకిగా ప్రేక్షకులకు ముందుకు వస్తున్నది. రకుల్ నటించిన తాజా చిత్రం జయ జానకి నాయక. ఈ చిత్రం ఆగస్టు 11న విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ఫిల్మీబీట్‌తో ప్రత్యేకంగా ముచ్చటించింది. తాను నటిస్తున్న టాలీవుడ్, బాలీవుడ్, తమిళ చిత్రాల గురించి అందించి వివరాలు ఆమె మాటల్లోనే.. సరైనోడు సినిమా సందర్భంగా నేను బోయపాటి శ్రీనుతో వర్క్ చేశా. ఆయనతో వర్క్ చేయడంతోపాటు ఎంజాయ్ చేశాను. బోయపాటి సినిమాల్లో హీరోయిన్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే జయ జానకి నాయక చిత్రానికి ఓకే చెప్పాను. ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగా ఉంటుంది.

# డైరక్షన్ అదుర్స్.. సినిమా అట్టర్‌ఫ్లాప్



( మొదటి పేజీ తరువాయి )

ఆరుగురిని అరెస్టుచేశారు.

**అసలేం జరిగిందంటే..**

మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్‌పై జరిగిన కాల్పుల మిస్టరీని పోలీసులు ఛేధించారు. విక్రమ్‌గౌడే నియోజకవర్గ ప్రజల సానుభూతి కోసం ఈ నాటకమాడాడని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.మహేందర్‌రెడ్డి బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు, అక్రమంగా ఆయుధాన్ని కలిగి, దాన్ని ఉపయోగించినందుకు విక్రమ్‌గౌడ్‌తో సహా ఆరుగురు నిందితులు ఎస్.నందకుమార్, షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్, కోకంటి బాబూజాన్ ఎ.గోవింద్‌రెడ్డిను అరెస్ట్‌చేశామని, ప్రస్తుతం విక్రమ్‌గౌడ్ ఆసుపత్రిలో ఉన్నందున కోలుకున్నాక అతడిని అరెస్ట్‌చేస్తామని వివరించారు. ఈ నేరంలో భాగస్వామ్యులైన వెంకటరమణ అలియాస్ చిన్నా, గౌస్‌లు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీచేయాలన్న లక్ష్యంతో విక్రమ్‌గౌడ్ ఈ నాటకానికి శ్రీకారం చుట్టారని, నిందితులను అదుపులోకి తీసుకుని, విక్రమ్ ఆసుపత్రిలో చెప్పిన అంశాలను విశ్లేషించి, శాస్త్రీయంగా రుజువయ్యాకే కేసులు నమోదు చేశామన్నారు. విక్రమ్‌గౌడ్ అబద్ధం చెబుతున్నాడంటూ తమకు ముందుగా ఆయన భార్య షిపాలిరెడ్డి ఫిర్యాదు ద్వారా తెలిసిందని, ఇందుకు సంబంధించి సీసీకెమెరాల ఫుటేజీ లభించడంతో నాటకమంటూ నిర్ధరణ అయ్యిందన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.5.3 లక్షల నగదు, స్కార్పియో వాహనం, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

**క్లాప్‌బోర్డ్ నుంచి మొదలు..**

విక్రమ్‌గౌడ్ గతంలో నిర్మాతగా ఇష్క్, గుండెజారి గల్లంతయ్యిందే అన్న సినిమాలను నిర్మించాడు. ప్రస్తుతం క్లాప్‌బోర్డ్‌పేరుతో ఉన్న కార్యాలయంలో కొత్తచిత్రాల రూపకల్పన చేస్తున్నాడు. ఇక్కడ పనిచేస్తున్న ప్రొద్దుటూరు వాసి ప్రసాద్ తన స్నేహితుడు, పులివెందుల వాసి ఎ.గోవిందరెడ్డికి సినిమాల్లో నటించాలన్న ఆసక్తి ఉందని ఐదునెలల క్రితం విక్రమ్ గౌడ్‌కు చెప్పడంతో, భవిష్యత్‌లో అవకాశాలిస్తానంటూ విక్రమ్ హామీ ఇచ్చారు. కొద్దిరోజుల అనంతరం విక్రమ్‌గౌడ్ ప్రసాద్‌కు ఇంటికి పిలిపించాడు. తనపై ప్రత్యర్థులు హత్యాయత్నానికి పాల్పడినట్టు నాటకమాడాలని, ఈ పనిచేస్తే రూ.50 లక్షలు ఇస్తానని, అడ్వాన్స్‌గా రూ.5 లక్షలిచ్చాడు. గోవిందరెడ్డి ఆ డబ్బు తీసుకుని అనంతపురం జిల్లా కదిరిలో ఉంటున్న డ్రైవర్ నందకుమార్‌కు విషయాన్ని వివరించాడు. అతడు ఒప్పుకోవడంతో హైదరాబాద్‌కు రమ్మన్నాడు.

**రెండు నెలల క్రితం పథకం..**

గోవిందరెడ్డి, నందకుమార్‌లు రెండునెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి విక్రమ్‌గౌడ్‌ను అతడి ఇంట్లో కలిశారు. తనపై హత్యాయత్నం పక్కాగా జరగాలని, రెండు భుజాలను కాల్చిన అనంతరం పొట్టకు సమీపంలో మరో రౌండ్ కాల్చి పారిపోవాలని, ఇలా చేస్తే జనంలో సానుభూతి పెరుగుతుందని, దీంతోపాటు తనకు అప్పు లిచ్చినవారు కూడా భయపడతారంటూ వారిద్దరికీ వివరించాడు. తనకిచ్చిన రూ.ఐదు లక్షల్లో గోవిందరెడ్డి రూ.3.5 లక్షలు నందుకిచ్చాడు. నందు కదిరి వెళ్లి తన స్నేహితులైన కార్పెంటర్ షేక్ అహ్మద్, బాబూజాన్‌కు వివరించాడు. ఇందుకు తుపాకీ కొనాలని... ఇండోర్‌లో తనస్నేహితుడు రయీస్ ఉన్నాడని అహ్మద్ చెప్పడంతో తుపాకీ కోసం అతనికి రూ.1.9 లక్షలను నందు ఇచ్చాడు. అప్పటికే రంజాన్ మాసం మొదలవడంతో కొనుగోలును వాయిదా వేశారు. ఈలోపు విక్రమ్‌గౌడ్ నందుకు పలుమార్లు ఫోన్‌చేయడంతో జులై 6న షేక్ అహ్మద్, బాబూజాన్‌తో పాటు వారి స్నేహితుడు వెంకటరమణ అలియాస్ చిన్నా కదిరి నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి విమానంలో ముంబయి మీదుగా ఇండోర్ వెళ్లారు. అక్కడ రయీస్ ఖాన్‌ను కలుసుకుని రూ.30వేలకు తుపాకీ, తూటాలు కొన్నారు. తుపాకీ తీసుకొని చిన్నా, రయీస్ బంధువు బస్సులో జులై8న బాలానగర్ చేరుకున్నారు.విక్రమ్‌గౌడ్ అక్కడికి వచ్చి తుపాకీ, తూటాలు ఇంటికి తీసుకెళ్లాడు. తుపాకీ విషయాన్ని విక్రమ్ తన భార్యకు కూడా చెప్పలేదు. రెండురోజుల తర్వాత నందుకు ఫోన్‌చేసి ఎప్పుడు కాల్చుతారంటూ ప్రశ్నించాడు. తన బంధువుకు బాగాలేదని, పుట్టపర్తిలో ఉన్నానని నందు చెప్పగా... విక్రమ్ రూ.1.5 లక్షలను తన డ్రైవర్‌కిచ్చి పుట్టపర్తికి పంపించాడు. డబ్బుతీసుకున్న నందు హైదరాబాద్‌కు రాకపోవడంతో విక్రమ్ అతడిని ఫోన్‌లో బూతులు తిట్టాడు. అసభ్యంగా సంక్షిప్తసందేశాలు పంపించాడు. స్పందించకపోవడంతో తానే స్వయంగా జులై17న పుట్టపర్తికి వెళ్లి రూ.50 లక్షలు కావాలంటే వెంటనే పనిచేయండంటూ హెచ్చరించాడు. దీంతో జులై 23న నందు, అహ్మద్, బాబూజాన్, చిన్నా, పులివెందుల నుంచి గోవిందరెడ్డి హైదరాబాద్ వచ్చారు. వీరందరినీ జూబ్లీహిల్స్‌ని తేజనివాస్ అతిథిగృహంలో విక్రమ్ ఉంచాడు. అదేరోజు రాత్రి విక్రమ్‌గౌడ్ సహా అందరూ సమావేశమై, ఒకటి,రెండురోజుల్లో పథకం అమలు చేయాలని నిర్ణయించుకున్నారు.

**కాల్చేందుకు వెనుకంజ... కదిరికి ప్రయాణం..**

సోఫాలో తాను కూర్చుని ఉండగా ఎక్కడ నిలబడి కాల్చాలి? ఎలా పారిపోవాలి? కాల్పుల శబ్దం విని భార్య వస్తే ఆమెను భయపెట్టేందుకు ఒకరౌండు కాల్చాలని, వాచ్‌మెన్ వస్తే అతడిపై ఒకరౌండు కాల్చాలని విక్రమ్ గౌడ్ వారికి వివరించాడు. కాల్చేందుకు ఒకరు ఇంట్లో, అతడితో కలిసి పారిపోయేందుకు ఇంటిబయట బైక్‌పై ఒకరుండాలని చెప్పాడు. గోవింద్‌రెడ్డి బైకును రూ.30వేలతో ప్రొద్దుటూరు నుంచి తెప్పించాడు. విషయం చాంద్రాయణగుట్టలోని గౌస్‌కు వివరించి, భాగస్వామిని చేసుకొని బైకు నంబరు, ఇంజిన్ మార్పించారు. జులై 26న పథకం అమలు చేయాలని విక్రమ్ నందును ఆదేశించాడు. అతిథిగృహంలో ఉన్న నందు, గోవిందరెడ్డి మాట్లాడుకుని తుపాకీతో కాల్చలేమని వెనుకంజవేశారు. ఈ క్రమంలోనే బైక్‌ను ఆలస్యంగా తీసుకురావాలంటూ గౌస్‌కు సూచించారు. జులై 26 తెల్లవారు జామున తన ఇంటికి విక్రమ్‌గౌడ్ రమ్మనడంతో నందు, గోవిందరెడ్డి, అహ్మద్ వచ్చారు. వారికి తుపాకీ ఇచ్చాడు. బైక్ రాకపోవడంతో గౌస్‌కు ఫోన్‌చేయగా స్పందించలేదు. దీంతో విక్రమ్‌గౌడ్ వారిని తీసుకుని కారులో చిల్కూరుకు వెళ్లి, అక్కడ తన అతిథిగృహంలో మరోమారు పథకం వివరించారు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చాక విక్రమ్‌కు సమాచారమివ్వకుండా నందు, గోవిందరెడ్డి, చిన్నా కదిరికి, బాబూజాన్ తన బంధువుల ఇంటికి వెళ్లారు. షేక్ అహ్మద్ సనత్‌నగర్‌లో బంధువుల వద్దకు వెళ్లిపోయాడు. తాను వెళ్తున్నానని నందు చెప్పడంతో విషయాన్ని ఓ సారి రయీస్‌కు చెబుదామని అహ్మద్ అన్నాడు. రయీస్ వచ్చాక తనకు సమాచారం ఇస్తే వస్తానని నందు వివరించాడు.

**రయీస్ రంగప్రవేశం...**

కాల్పుల నాటకమాడితే రూ.లక్షల్లో డబ్బులొస్తాయని షేక్ అహ్మద్ ఇండోర్‌లో ఉన్న రయీస్‌కు ఫోన్‌చేయగా, అతడు ఒప్పుకొని జులై 27 మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. అహ్మద్ నందుకు ఫోన్‌చేయగా అతడు కదిరి నుంచి స్కార్పియోలో హైదరాబాద్‌కు వచ్చాడు. ముగ్గురూ అతిథిగృహానికి చేరుకున్నాక విక్రమ్‌కు సమాచారమిచ్చారు. ఈలోపు అహ్మద్, రయీస్‌లు బైక్‌ను విక్రమ్ ఇంట్లో ఉంచి వచ్చారు. అదేరోజు రాత్రి విక్రమ్,నందు, అహ్మద్, రయీస్‌లు అతిథిగృహంలో సమావేశమై, లోటుపాట్లు లేకుండా పథకం అమలు చేయాలని నిర్ణయించుకున్నారు. జులై 28 తెల్లవారుజామున 2.30గంటలకు విక్రమ్‌గౌడ్ ఇంటికి కారులో బయలుదేరారు. కాపలాదారు గుర్తిస్తే ప్రమాదమని గ్రహించి విక్రమ్ వారిని ఇంటి బయటే దింపాడు. తన స్నేహితులు వస్తున్నారని, గేటు తెరిచే ఉంచాలని కాపలాదారుడుని ఆదేశించాడు. కొద్దిసేపటికి నందు, అహ్మద్, రయీస్‌లు విక్రమ్ ఇంటికి వచ్చారు. దర్గాలో అన్నదానం చేద్దాం.. తయారుగా ఉండు అంటూ విక్రమ్ తన భార్యకు చెప్పాడు. తాను స్నానం చేసి కిందికి వచ్చాడు. వారితో మాట్లాడాక తనగదిలోకి వెళ్లి ఐదు తూటాలున్న తుపాకీ, రూ.8లక్షల నగదుతో వచ్చాడు. నందుకు రూ.4 లక్షలు, అహ్మద్‌కు రూ.2 లక్షలు, రయీస్‌కు రూ.2లక్షలు ఇచ్చాడు. రయీస్‌ను ఇంట్లో ఉండమని, బైక్ బయటకు తీసుకెళ్లి ఇంజిన్ ఆన్‌లో ఉంచాలని అహ్మద్‌కు చెప్పాడు. శిరస్త్రాణం కూడా విక్రమే ఇచ్చాడు. నందు తాను బయటకు వెళ్తానని చెప్పి వెళ్లిపోగా.. తెల్లవారు జామున 3.30 గంటలకు రయీస్ విక్రమ్‌గౌడ్‌పై రెండురౌండ్ల కాల్పులు జరిపాడు. మూడోరౌండ్ కాల్చుతుండగా... విక్రమ్ సోఫాలో ఒరిగిపోవడంతో బయటకు వెళ్లీవెళ్లగానే అహ్మద్ బైక్‌పై కూర్చుని ఇద్దరూ పారిపోయారు. హకీంపేట చెరువు సమీపంలో నీళ్లలో తుపాకీ పారేసి, బైకును అక్కడే వదిలేసి ఇద్దరూ చెరోదారిన వెళ్లిపోయారు. క్లిష్టమైన కేసులో వేగంగా దర్యాప్తు చేసిన డీసీపీలు ఎ.వెంకటేశ్వరరావు, లింబారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజావెంకటరెడ్డి, శ్రీనివాస్‌లను కొత్వాల్ మహేందర్‌రెడ్డి అభినందించారు.

## రైల్వే తత్కాల్ ప్రయాణీకులకు

# భారీ ఊరట!




న్యూఢిల్లీ: తత్కాల్ టికెట్ల బుకింగ్ సమయంలో ఇబ్బందులు పడుతున్న రైల్వే ప్రయాణికులకు రైల్వే శాఖ భారీ ఊరట నిచ్చింది. ముఖ్యంగా అత్యవసరంగా ప్రయాణించాలనుకునే ప్రయాణీకులు టికెట్‌ను ఆన్‌లైన్‌లో తక్షణం బుక్ చేసుకుని, పేమెంట్ తరువాత చేసే వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటివద్ద చెల్లించే (పే ఆన్ డెలీవరీ) సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్టు బుధవారం ఐఆర్‌సీటీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

భారతీయ రె%ల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌టీసీ) వెబ్ సె%ట్లో తత్కాల్ కోటా కింద బుక్ చేసుకున్న టిక్కెట్లకు డబ్బును తరువాత చెల్లించవచ్చని ఐఆర్‌సీటీసీ బుధవారం ప్రకటించింది.

ఇంతవరకు, ఈ సేవ సాధారణ రిజర్వేషన్లకు మాత్రమే అందుబాటులో ఉంది. తాజా నిర్ణయం ద్వారా తత్కాల్ బుకింగ్‌ల కోసం ఆ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఇందుకోసం వినియోగదారులు irctc.payondelivery.co.in తో నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ లేదా పాన్ వివరాలు జతచేయాలి. అలాగే టికెట్ బుకింగ్ చేస్తున్నప్పుడు పే-ఆన్ డెలివరీ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. డిజిటల్ డెలివరీ ఎస్‌ఎంఎస్ / ఇ-మెయిల్ ద్వారా తక్షణమే జరుగుతుంది.

24 గంటల లోపు పేమెంట్ స్వీకరణ జరుగుతుంది. ఒకవేళ టికెట్ల డెలివరీ లోపు క్యాన్సిల్ చేసుకుంటే చట్ట ప్రకారం భారీ జరిమానా తప్పదు. అంతేకాదు ఐఆర్‌సీటీసీ ఖాతా శాశ్వతంగా క్లోజ్ అవుతుంది.

టికెట్లు తమ ఇంటి దగ్గర బట్వాటా చేయాలనుకుంటే, వినియోగదారులు నగదు, డెబిట్ కార్డు లేదా క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించాల్సి ఉంటుందని ఐఆర్‌సీటీసీ చెల్లింపు ప్రొడ్యూసర్ ఆండూరిల్ టెక్నాలజీస్ తెలిపింది. ఈ పే డెలివరీ ఫీచర్ ద్వారా వినియోగదారులు కొన్ని సెకండ్లలో తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం కలుగుతుందని ఆండూరిల్ టెక్నాలజీస్ సీఈవో అనురాగ్ బాజ్‌పాయ్ తెలిపారు.

తద్వారా ఇది లక్షలాది మంది ప్రయాణీకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

తత్కాల్ బుకింగ్ సమయంలో తరచుగా డబ్బు డెబిట్ అయినా, టికెట్ బుక్ కాకపోవడం, అలాగే డబ్బులు తిరిగి మన ఖాతాలోకి చేరడానికి కనీసం 7 నుంచి 15 రోజుల సమయం పడుతుంది.

ఈ కొత్త ఈ లావాదేవీల వైఫల్యాలను తొలగిస్తుందని ఆయన వివరించారు.

కాగా ఐఆర్‌సీటీసీ రోజువారీ లక్షా 30వేల తత్కాల్ లావాదేవీలను నిర్వహిస్తుంది.

అయితే ఈ టికెట్ల మెజారిటీ కోటా ప్రారంభపు నిమిషాల్లోనే ఖతం కావడం కూడా తెలిసిందే.

## ఆంధ్ర రాష్ట్ర అభ్యున్నతికి తోడ్పడండి




విశాఖపట్నం: ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నియమింపబడిన కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు ఆంధ్ర రాష్ట్ర అభ్యున్నతికి తోడ్పడాలని, విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు విశేష కృషి చేయాలని ప్రత్యేక హెూదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా వెంకయ్యనాయుడు ఉన్నప్పుడు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర విభజన జరిగిన విషయం తెలిసిందేనని, అప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి ఇస్తానన్న ప్రత్యేక హెూదా ఇప్పటి వరకు అమలు జరగలేదని, గట్టిగా అడిగితే ఆంధ్రా అభ్యున్నతికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం జరిగిందని తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్రం నుండి రావలసిన ప్రత్యేక నిధులను వెంటనే విడుదల చేయించి తన వంతు సహకారాన్ని అందించాలని కోరారు. అదే విధంగా అప్పుడు అమలుచేస్తామన్న రైల్వే జోన్‌ను ప్రత్యేకంగా అమలు చేయించడానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. కేంద్రంతో ఐక్యతతో ఉంటేనే ఆ నిదులు రాబట్టుకోగలమని చంద్రబాబు మాయ మాటలు చెప్పి ఇన్ని సంవత్సరాలు గడుస్తున్నా ఆంధ్రా అభివృద్ధికి చేసేది శూన్యమేనని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు, సాధన సమితి సభ్యులు స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## గీతం మేనేజ్‌మెంట్ విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ సేవలు



సాగర్‌నగర్: గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా ఎమ్‌బిఎ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు సభ్యులుగా గల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించినట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ షంసుద్దీన్ తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో నగరపాలక సంస్థ పాఠశాలలోని దాదాపు 10 వేల మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# రవిశాస్త్రికి దాదా చురక

### ఇంగ్లాండ్, పాక్‌పై విజయాలను మర్చిపోయావా!



ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరభ్ గంగూలీ టీమిండియా కోచ్ రవిశాస్త్రికి చురక అంటించాడు. దిగ్గజ ఆటగాళ్లతో కూడిన భారత జట్లకు సాధ్యం కాని విజయాన్ని విరాట్ కోహ్లీ సారథ్యంలోని యువ జట్టు అందుకుందని శాస్త్రి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా దాదా స్పందించాడు. ఇంగ్లాండ్, పాకిస్థాన్‌పై సాధించిన విజయాలను శాస్త్రి మర్చిపోయాడని దాదా అన్నాడు.

నిజంగా చెప్పాలంటే.. శాస్త్రి వ్యాఖ్యలపై నేను అంతగా మాట్లాడదలచుకోలేదు. గంగూలీ, సచిన్, లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా కమిటీ అతనికి మంచి ఉద్యోగం ఇచ్చింది. దాన్ని సద్వినియోగం చేసుకుని 2019 ప్రపంచ కప్ టోర్నీ వరకు కోచ్ పదవిలో కొనసాగి భారత్‌కు ట్రోఫీ అందించేలా కృషి చేయాలని కోరుకుంటున్నా. 2007లో ఇంగ్లిష్ గడ్డపై ఇంగ్లాండ్‌పై విజయం సాధించాం. దాయాదీ గడ్డపై పాక్‌ను చిత్తు చేశాం. దయచేసి ఒకదానితో మరొకటి పోల్చొద్దు. భవిష్యత్తులో కోహ్లీ సేన మరిన్ని విజయాలు అందుకునేలా నీ సేవలు అందించు అని గంగూలీ అన్నాడు.

రవిశాస్త్రి ఇటీవల ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడుతూ... గతంలో దిగ్గజ ఆటగాళ్లతో కూడిన జట్లకు సాధ్యం కాని విజయాలను ఇప్పటికే ప్రస్తుత జట్టులోని కుర్రాళ్లు అందుకున్నారు. రెండేళ్ల క్రితం శ్రీలంక పర్యటనే అందుకు ఉదాహరణ. పెద్ద పేరున్న ఆటగాళ్లు టీమిండియా తరఫున 20 ఏళ్ల పాటు ఆడారు. వాళ్లు శ్రీలంకలో చాలా సార్లు పర్యటించినా ఎప్పుడూ సిరీస్ గెలవలేదు. కానీ ఈ కుర్ర జట్టు సాధించింది. మిగతా భారత జట్లకు, ప్రత్యేకంగా విదేశీ పర్యటనల్లో సాధ్యం కాని ఘనతలను అందుకునే సత్తా ఈ జట్టుకు ఉంది అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## పెట్రోల్, డీజిల్‌ను

# జీఎస్టీలో చేర్చండి



జంగారెడ్డిగూడెం: కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీలో చేర్చాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తూ జంగారెడ్డిగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు మోదీ మూడేళ్లలో రూ.13.5లక్షల కోట్లు ధారాదత్తం చేశారని ఆరోపించారు. కోట్లాది మంది సామాన్య ప్రజలు అనుభవిస్తున్న గ్యాస్ సబ్సిడీ రద్దును తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. కమ్యూనిస్టులపై భాజపా, తెరాస, తెదేపా విమర్శలకు దిగుతున్నాయని.. అదే ధోరణి కొనసాగిస్తే వారి వినాశనం తప్పదని హెచ్చరించారు. కమ్యూనిస్టులను విమర్శించే స్థాయి కేసీఆర్‌కు లేదన్నారు. ఎన్నికలప్పుడు సురవరం సుధాకర్‌రెడ్డి తదితర కమ్యూనిస్టులకు వంగి వంగి దండాలు పెట్టిన కేసీఆర్ ఈరోజు వారినే విమర్శిస్తారా? అని ప్రశ్నించారు.

# మార్కెట్‌లో 'శ్రావణ' రద్దీ

- ఇసుక వేస్తే రాలని జనం
- కిటకిటలాడుతున్న బంగారం షాపులు
- చుక్కలను తాకిన పువ్వుల ధరలు
- కొబ్బరి కాయలకు భలే గిరాకీ
- పోటాపోటీగా పెరుగుతున్న పండ్ల ధరలు
- వెరశి సామాన్యుని జేబుకు చిల్లు



విశాఖపట్నం: మాసములలోకెల్లా లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమైన నెల శ్రావణ మాసం. ఈ మాసంలో కన్యలు, స్త్రీలు సౌభాగాన్ని కోరుకుంటూ లక్ష్మీ దేవికి ప్రీతిపాత్రం కలిగించే విధంగా పూలు, పండ్లు, నైవేద్యాలతో పూజలు చేస్తుంటారు. శ్రావణ లక్ష్మి కరుణా కటాక్షాలు కోరుతూ ప్రతీ మహిళ కనీసం లక్ష్మీ కాసు (రూపు) కొంటారు. దీంతో బంగారం దుకాణాలు రద్దీతో ధగధగ మెరిసిపోతున్నాయి. భక్తజనంతో మార్కెట్ కిటకిటలాడింది. దీనిని దృష్టిలో పెట్టుకుని పూలు, పండ్లు అమ్మే వర్తకులు ధరలు పోటాపోటీగా పెంచేసి వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. చివరకు మార్కెట్‌లో మామిడి కొమ్మలు, గరిక కూడా అమ్మేస్తున్నారు. అమ్మకానికి కాదేదీ అనర్హం.. అన్న చందంగా చామంతులు, గులాబీలు ధర గుబాళింపు



పెరిగిపోతోంది. ఏమీ చేసేది లేక సామాన్యులు సైతం తప్పని సరి పరిస్థితులలో కనీసం డజను చామంతులు, కొబ్బరికాయ కొనుగోలు చేసి రావమ్మ మహాలక్ష్మి.. అంటూ వరలక్ష్మికి స్వాగతం పలికి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.

## మీ తప్పిదాలకు మమ్మల్ని నిందిస్తారా?

### కేసీఆర్ వ్యాఖ్యలకు జానా కౌంటర్

హైదరాబాద్: కడుపు మండి ఎవరైనా కోర్టులకు వెళ్తే దానికి కాంగ్రెస్ బాధ్యత వహించాలా? అని ప్రతిపక్ష నేత జానారెడ్డి సీఎం కేసీఆర్‌ను నిలదీశారు. పిశాచి కాంగ్రెస్ అంటూ సీఎం తన హుందాతనాన్ని మరచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలు తెరాస పార్టీ వారికే వర్తిస్తాయన్నారు. ప్రభుత్వం చేసే తప్పిదాలను విమర్శిస్తే వివరణ ఇవ్వాల్సింది పోయి తమనే నిందిస్తున్నారన్నారు. అసభ్య పదజాలం వాడటం కేసీఆర్, తెరాస నేతలకు మంచిది కాదని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన తప్పులను కాంగ్రెస్ నెత్తిన వేయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాల వల్లే న్యాయస్థానాలు స్టేలు ఇస్తున్నాయన్నారు. ప్రభుత్వం చేస్తోన్న తప్పిదాలను సరిచేసుకోకుండా కాంగ్రెస్‌ను ఎలా నిందిస్తారని జానా ప్రశ్నించారు. ప్రతిపక్షాలను మాట్లాడనీయకుండా ఇష్టానుసారంగా చేస్తామంటే కుదరదన్నారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ సమర్థించిన విషయాన్ని ఈ సందర్భంగా జానారెడ్డి గుర్తుచేశారు. వారసత్వ ఉద్యోగాలపై ప్రభుత్వానికి సలహాలు కూడా ఇచ్చినట్టు చెప్పారు.




## డ్రెయిన్లను

# సక్రమంగా నిర్వహించండి

### సాగర్‌నగర్‌లో విస్తృత పర్యటన

### జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖ సిటీ: జివియంసి ఒకటవ జోన్‌కు చెందిన సాగర్‌నగర్ , ముసలివాని పేట ప్రాంతాలను జివియంసి కమిషనర్ హరినారాయణన్ గురువారం సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలోని డ్రెయిన్లను, గెడ్డలను పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా డ్రెయిన్లను క్లియర్ చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా జివియంసి స్థలాలను ఫెన్సింగ్ చేసి బోర్డులను పెట్టాలని పేర్కొన్నారు.

పర్యటనలో జోనల్ కమిషనర్ సత్యవేణి, ఏసిపి మధుసూదనరావు, డి.ఇ దిలిప్ కుమార్, ఏ.ఇ భరణికుమార్ ఇతర జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com